

గోదారికి వరద పోటు



గోదావరికి వరద పోటు తగ్గలేదు.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రతి రోజూ సుమారు 2 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.. శుక్రవారం 2.46 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. - మెయిన్‌లో

నేటి నుంచే వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ : డీఎస్‌వో



రాజమహేంద్రరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్లు ప్రతినెలా 26వ తేదీ నుంచి 30వ తేదీలోపు 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే రేషన్ అందించాలని డీఎస్‌వో వి.పార్వతి తెలిపారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కృష్ణనాయక్‌తో కలిసి శుక్రవారం సివిల్ సప్లయిస్ అధికారులు, రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా రేషన్‌పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రతి డీలర్ తప్పనిసరిగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్‌షాపులు తెరచి ఉంచాలన్నారు. ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ డీలర్లు ప్రతిరోజూ నిర్ణీత సమయానికే షాపులు తెరవఆలన్నారు.ఏఎస్‌వో నాగమల్లేశ్వరరావు,అధికారులు,డీలర్లు పాల్గొన్నారు.

అమ్మా..శ్రావణలక్ష్మి!



శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజమండ్రి దేవిచౌక్‌లోని అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు..

నవంబరులోపు సర్వే పూర్తి చేయాలి

రాష్ట్ర భూ పరిపాలన శాఖ అదనపు కమిషనర్ ప్రభాకరరెడ్డి

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నవంబరులోపు ప్రభుత్వ భూములు మొత్తం సర్వేచేసి, గ్రామాల సరిహద్దుల నిర్ధారణ చేయాలని రాష్ట్ర భూ పరిపాలన శాఖ(సీసీఎల్ఏ) అదనపు కమిషనర్ డా.ఎన్. ప్రభాకరరెడ్డి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్. చిన్నరాముడుతో కలసి అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూముల గుర్తింపు, గ్రామాల సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన మూడో దశ రీసర్వేపై తహశీల్దార్లు అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్వీసు ఈనామ్ భూములు సంస్థాగత, వ్యక్తిగత అనే విభాగాలుగా వర్గీకరించారన్నారు. సర్వే, మ్యుటేషన్ సమయంలో నోటీసులివ్వడం లేదన్న ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని. నోటీసులు అందేలా తప్పనిసరిగా చూడాలన్నారు. నోటీసులు అందినట్టు ఆధారాలు చూపకుంటే సంబంధిత అధికారిపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ రెవెన్యూ కోర్టులను తప్పకుండా నిర్వహించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించిన తర్వాత కూడా ఫిర్యా దులు ఎందుకు వస్తున్నాయో పరిశీలించాలని, రీ సర్వే డీటీ, వీఆర్వోలు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి చర్యలు చేపట్టాలని చెప్పా రు. తప్పుగా ఉన్న రికార్డు ప్రజలకు అందుబాటులో ఉంచరాదని, సవరించిన రికార్డు మాత్రమే ఉంచాలని చెప్పారు. అంతిమ భూ రికార్డు (ఫైనల్ ల్యాండ్ రికార్డ్ - ఎఫ్ఎల్ఆర్) రూపొందించిన గ్రామాల్లో రెవిన్యూ సమస్యలన్నీ పరిష్కరించి వివాదం లేని గ్రామం(డిస్ప్యూట్ ఫ్రీ విలేజ్) గా ప్రకటించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు మూడు రోజు ల పాటు రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో ఉండాలని ఆదేశించినట్టు చెప్పారు. నల్లజర్ల, గోపాలపురం, బిక్కవోలు, రాజమండ్రి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భూ సమస్యలు, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు.

కూలుతుందో.. ఏమో!



ప్రమాదంలో కాకినాడ పెద్దాసుపత్రి

- స్లాబ్‌లకు లీకులు
- పాత భవనాలతో భయం
- జేఎన్‌టీయూ ఇంజనీర్ల పరిశీలన
- తొలగించాలని నివేదిక
- కొత్త నిర్మాణాలకు రూ.500 కోట్లు
- ప్రభుత్వానికి ప్రతిపాదలు
- పవన్ స్పందించాలని డిమాండ్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పేదలకు పెద్ద దిక్కయిన కాకినాడ జీజీహెచ్ దీనంగా మారింది. వేలాది మంది రోగులకు సేవలందిస్తోన్న విభాగాలు బిక్కుబిక్కుమంటున్నాయి. పాడుబడిన భవనాలు, ఎప్పుడు కూలుతాయో తెలియని బ్లాకులు రోగులు, వైద్యులను నిరంతరం భయపెడుతున్నాయి. అసలే వర్షాకాలం ఆరంభమవడంతో లీకవుతున్న శ్లాబ్‌లు, తడిచిపోతున్న రికార్డులతో జీజీహెచ్ ప్రమాదకరంగా మారింది. ఆసుపత్రికి కొత్త భవనాల నిర్మాణం అత్యవసరమైనా నిధుల్లేక ఈసురోమంటోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పేదలకు పెద్దదిక్కు కాకినాడ జీజీహెచ్. ఏ పెద్ద అనారోగ్యం వచ్చినా వారంతా వచ్చేది ఇక్కడికే. వందలాది మంది ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లతో ఈ ప్రభుత్వాసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు కూలుతాయో అన్నట్టు మారాయి. అసలే వర్షాల నేపథ్యంలో ఎక్కడికక్కడ అనేక విభాగాల్లో గోడల దగ్గర నుంచి శ్లాబ్‌ల వరకు వర్షపునీరు లీకవుతోంది. దీంతో ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళన అందరినీ వెన్నాడుతోంది.

నిధులెప్పుడిస్తారో..

గతేడాది కాకినాడ జేఎన్టీయూ ఇంజనీర్లు ఈ భవనాలన్నింటిని పరిశీలించారు. వీటిలో అనేక భవనాలు బలహీనంగా ఉన్నట్టు గుర్తించారు. అనేక బ్లాకులు తొలగించాల్సిందేనని ఇప్పటికే నివేదిక ఇచ్చారు. పాడైన భవనాలను తొలగించి వాటి స్థానంలో జీప్లస్ 8 విధానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.500 కోట్ల వరకు ఖర్చవుతుందని తేల్చారు. ఈమేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి గతేడాది నివేదిక పంపారు. కొత్త భవనాల్లో 600 పడకలు ఉండేలా ప్రణాళికలు రూపకల్పన చేశారు. నిధుల విడుదలకు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు గుర్తుచేసినా ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్టే చెబుతున్నారు. జీజీహెచ్‌కు కొత్త భవనాలు ఎప్పుడు సమకూరుతాయో తెలియని పరిస్థితి. జిల్లా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నిధులు విడుదలపై దృష్టిసారించాల్సి ఉంది.

రోజూ వేలాదిగా రోగులు..

జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగానికి రోజూ రెండు వేలమంది వరకు రోగులు వస్తారు. ఇన్ పేషెంట్ విభాగంలో 1,600 నుంచి 1,800 వరకు రోగులు ఉంటారు. నిత్యం వేలాది మంది రోగులతో ఆసుపత్రి కిటకిటలాడుతుంటుంది. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పిడియాట్రిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ వంటి ఎన్నో విభాగాల్లో రోగులకు కావాల్సిన సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రేలు అందుబాటులో ఉంటాయి. ఐసీయూలతోపాటు యాక్టివ్ మెడికల్ కేర్ యూనిట్లు, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు నిరంతరం పనిచేస్తాయి. 24 గంటలూ ఇక్కడ చికిత్స అందుతుంది. అటు జీజీహెచ్‌కు అనుబంధంగా రంగరాయ మెడికల్ కాలేజీ నుంచి వందలాది మంది వైద్యులు, నర్సులు జీజీహెచ్ విధుల్లో ఉంటారు. ఏ అనారోగ్యం వచ్చినా, ప్రమాదాలు జరిగినా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక వేలాదిమంది ఇక్కడకే శస్త్రచికిత్సకు వస్తారు. ప్రధానంగా సోమవారం రోజైతే ఓపీ విభాగాలు కిక్కిరిసిపోతాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుంచి రిఫర్ కేసుల సంఖ్య ప్రతి రోజూ ఉంటుంది. ఏ పెద్ద ప్రమాదం జరిగినా ఆయా కేసులను వెంటనే కాకినాడకు రిఫర్ చేసేస్తారు.

బాబోయ్.. ఆ బ్లాకులు..

ఆసుపత్రిలో అనేక భవనాలు దాదాపు 50 నుంచి 60 ఏళ్లు దాటిపోయాయి. దీంతో అనేక బ్లాకులు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టున్నాయి. ప్రధానంగా అడ్మినిస్ట్రేషన్ భవనం రెండో అంతస్తులో శ్లాబ్‌ల నుంచి వర్షం నీరు లీకవడం వల్ల ఎంఆర్‌డీ సెక్షన్‌లో మెడికల్ రికార్డులన్నీ పాడవుతున్నాయి. పైగా స్లాబు పెచ్చులూడిపోవడంతో కొన్ని ప్రత్యేక వార్డులను పూర్తిగా మూసివేశారు. ఇదే భవనంలో ఈఎన్‌టీ, డెంటల్ విభాగాలు, ఓపీ జరిగే విభాగాల్లో షెడ్లు వర్షాలకు పడిపోయాయి. సర్జికల్‌వార్డు, ఆర్థోపెడిక్, అడ్మినిస్ట్రేషన్ భవనం, మెడికల్ వార్డు భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. జీప్లస్3 విధానంలో ఉన్న ఈ భవనాలన్నీ కూల్చాల్సిన పరిస్థితి ఉంది. వాస్తవానికి ఈ పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. గత వైసీపీ సర్కారు అయితే కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించేసింది. కానీ ఆసుపత్రి భవనాలు మాత్రం నిర్మించలేదు. పలుసార్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనల్లో పాత భవనాల నిర్మాణాలకు నిధులిస్తున్నట్టు చెప్పినా కనీసం చిల్లిగవ్వ ఇవ్వలేదు.



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

వైసీపీ హయాంలో 16,260 మంది లివర్లు చెడిపోయాయి..

- జే బ్రాండ్ మద్యమే కారణం
- తూర్పు ప్రభుత్వాసుపత్రిలో ఇదీ ఐదేళ్ల పేషెంట్ల లెక్క
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జే బ్రాండ్ లిక్కర్ ఏరులైపారించి లివర్ వ్యాధిగ్రస్తులు పెరిగేలా చేసిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. రాజమహేంద్రవరం టింబర్ మర్చంట్ అసోసియేషన్ హాలులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా 16,260 మంది లివర్లు పాడై అనేక మంది ప్రాణాల మీదకు తెచ్చుకున్నారని చెప్పారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి లెక్కల ప్రకారం 2020లో లివర్ వ్యాధిగ్రస్తులు ఇన్ పేషెంట్లుగా 8 మంది చేరగా 1303 మంది ఔట్ పెషేంట్లుగా చికిత్స చేయించుకున్నారని 2021లో 116 మంది ఇన్ పేషెంట్లు ఉంటే 3142 మంది చికిత్సచేయించుకున్నారన్నారు. 2022లో 167 మంది చేరితే 3961 మంది ఔట్ పెషేంట్లుగా చికిత్స చేయించుకున్నారని తెలిపారు. 2023లో 193 మంది చేరితే 2394 మంది చికిత్స చేయించుకున్నారన్నారు. 2024లో 345 మంది చేరితే 4631 మంది చికిత్సపొందారని చెప్పారు. ఇలా ప్రతి ఏటా లివర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య కేవలం కల్తీ మద్యం వల్లనే పెరిగిందన్నారు. జగన్ జమానలో ఫ్ లిక్కర్‌కు బానిసలై వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. 2025లో 109 మంది ఆసుపత్రిలో చేరితే 1800 మంది కిత్స చేయించుకున్నారన్నారు. లిక్కర్ స్కాంలో జైలులో ఉన్న మిథున్‌రెడ్డికి సదుపాయాల కల్పన చూస్తే అతను పిక్నిక్ వచ్చినట్టుగా ఉందన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నాయకులు మజ్జి రాంబాబు, కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు,బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, రవి యాదవ్, చాపల చిన్నరాజు, దాస్యం ప్రసాద్,చిన్ని పాల్గొన్నారు.

జిల్లాలో పీ4 కుటుంబాలు 57000

- ఇప్పటికే గుర్తించాం
- సీఎం వీసీలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పేదరికంలో ఉన్న కుటుంబాల ఆర్థికాభివృద్ధికే పీ4 మార్గదర్శి, బంగారు కుటుంబం పథకం రూపొందించినట్టు సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.ఈ మేరకు శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ప్రతి కుటుంబం విద్య, ఉపాధి, ఆరోగ్య, భవన అవసరాలతో అభివృద్ధి చెందాలనే కార్యాచరణ చేపట్టామన్నారు. ఒక వ్యక్తి ఒకే కుటుంబం కాకుండా వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మందిని దత్తత తీసుకుంటే మంచిదన్నారు. తగిన ఆధారాలు, అర్హత ప్రమాణాల ఆధారంగానే ఎంపిక ఉండాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://జీరోప్రావర్టీపీ4.ఏపీ.జీవో వీ.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా స్వయంగా కుటుంబాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు చెప్పారు. జిల్లాలోని పీ4 పథకం గురించి కలెక్టర్ పి.ప్రశాంతి సీఎం చంద్రబాబుకు వివరించారు.తాను ఇప్పటికే ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నానని చెప్పారు.జిల్లాలోని 489 గ్రామ, వార్డు సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి 1226 మంది మార్గదర్శకులను 12500 మంది బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 57 వేల బంగారు కుటుంబాలను ప్రాథమిక సర్వే చేసి గుర్తించినట్టు చెప్పారు. మార్గదర్శకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ప్రతీ అధికారి, ఉద్యోగి, సమాజంలో మెరుగైన స్థితిలో ఉన్న వ్యక్తులు ఒకరిని తప్పకుండా దత్తత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు బంగారు కుటుంబాల జీవనోపాధి కల్పన, స్థిరమైన అభివృద్ధికి సమగ్ర కార్యచరణ ప్రణాళిక, ఆయా కుటుంబాల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి,సీపీవో అప్పలకొండ పాల్గొన్నారు.

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ!



- గత 65 ఏళ్లుగా ఇంతే
- నేడు..రేపు అంటూ సాగదీత
- నేటికీ లైన్‌లో పడని పనులు
- తెలంగాణలో పూర్తయిన వైనం
- ఏపీలో ఎదురుచూపులు
- ప్రాజెక్ట్ పూర్తయితే ఉపయోగం
- ఎంపీ పురందేశ్వరి దృష్టి పెట్టాల్సిందే



పట్టాలెక్కని కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైన్ పనులు

కొవ్వూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు -భద్రాచలం రైల్వే లైను నిర్మాణంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు ఆరున్నర దశాబ్దాలుగా కాలయాపన చేస్తున్నాయి. అసలు ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తుందా అని సందేహాలను వ్యక్తమవుతున్నాయి. భద్రాచలం - కొవ్వూరు రైల్వేలైను నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రైల్వే శాఖ నుంచి గతేడాది హామీ లభించింది. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభమయ్యేది కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందని రైల్వే అధికారులు తేల్చి చెబుతున్నారు.

నిధులిస్తామన్నా.. కదలికేది..

కొవ్వూరు -భద్రాచలం రైల్వే మార్గంపై తొలిసారిగా 1960లో సర్వే చేశారు.అప్పటి నుంచి ప్రతి బడ్జెట్‌లోను ఈ రైల్వే లైను గురించి ప్రస్తావన వస్తున్నప్పటికీ ఏనాడు రూపాయి విదల్చలేదు.గడచిన పదేళ్లలో సర్వే,ఇతర పనుల కు రూ.40 కోట్ల వరకు కేటాయించారు. 2011-2012 బడ్జెట్‌లో రైల్వే శాఖ కొవ్వూరు -భద్రాచలం రైల్వే లైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైను నిర్మాణానికి రూ.2,155 కోట్లు అవసరమని అంచనాలు తయారుచేశారు. ఇదిలా ఉండగా ఇటీవల సుమారు రూ.2,155 కోట్లు ప్రతిపాదిత వ్యయం మంజూరు చేస్తున్నట్టు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ప్రకటిస్తూ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి రాతపూర్వకంగా తెలియజేశారు. అయినా ముందుకు కదల్లేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఎంపీగా పురందేశ్వరి ఉండడంతో కదలిక వస్తుందని అంతా ఆశించారు. అయినా అంతే.నిర్మాణం వ్యయం పెరుగుతుంది.

తెలంగాణలో ఓకే.. ఏపీలో షాకే..

2014లో రాష్ట్ర విభజన అనంతరం బొగ్గు రవాణా అవసరాల దృష్ట్యా భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు దాదాపు 54 కిలోమీటర్లు రైల్వేలైను నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం తరపున సింగరేణి సంస్థ యాజమాన్యం రూ. 706 కోట్లు ఖర్చు భరించగా.. దక్షిణ మధ్య రైల్వే తన వాటా రూ.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.దీంతో కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు నిర్మించిన రైల్వే లైనును 2022లో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు.ప్రస్తుతం కొవ్వూరు- సత్తుపల్లి మధ్య రైల్వే లైను నిర్మాణం పూర్తిచేస్తే సరిపోతుందని భావిస్తున్నారు.సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు (కొవ్వూరు,దేవరపల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా తెలంగాణలోని ఆశ్వారావుపేట, సత్తుపల్లి వరకు రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైల్వే లైను పనుల్లో పురోగతి లేదు.ఈ రైలు మార్గం నిడివి మొదట్లో 165 కిలోమీటర్లు ఉండగా ప్రస్తుతం 119 కిలోమీటర్లకు తగ్గింది. ఒప్పందం ప్రకారం 100 కిలోమీటర్ల వరకు ప్రస్తుత ఏపీ ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. ఇప్పటికే తెలంగాణలో నిర్మాణం పూర్తిచేసుకుని ఏపీ నిధులకు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.కూటమి ప్రభుత్వమైనా రైల్వే లైను నిర్మాణ పనులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భూసేకరణ చేస్తే సరి..

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, రైల్వే యూనియన్ నాయకుడు ఉన్నికృష్ణన్‌లతో కలిసి ఈ నెల 15న సికింద్రాబాద్ రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర అధికారులను కలిసి సత్తుపల్లి నుంచి కొవ్వూరు నూతన రైల్వే నిర్మాణ పనులపై ప్రస్తావించారు.దీనిపై రైల్వే జీఎం శ్రీవాస్తవ స్పందిస్తూ భద్రాచలం రోడ్- కొవ్వూరు రైల్వే లైను నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం తమ వాటా సొమ్ము చెల్లించడంతో భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు లైను నిర్మాణం పూర్తయిందని, ఏపీ ప్రభుత్వం భూ సేకరణ చేసి అప్పగిస్తే 2030 నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. రైల్వే లైను నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అసెంబ్లీలో చర్చించారు.ఇప్పటికైనా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల ఎంపీలు ఈ రైల్వే లైను నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖపై ఒత్తిడి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే జీఎంతో చర్చిస్తున్న ఎంపీ పురందేశ్వరి(ఫైల్)

ఈ లైన్ పూర్తయితే లాభం..

కొవ్వూరు-భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) మధ్య రైల్వే లైను నిర్మాణం పూర్తయితే విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య సుమారు 110 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. రెండున్నర గంటలకు పైగా ప్రయాణ సమయం ఆదా అవుతుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై భారం తగ్గించే వెసులబాటు ఉంటుంది. కేవలం హైదారాబాద్ ప్రయాణించే రైళ్లే కాకుండా వరంగల్ మీదుగా నాగపూర్, జైపూర్, న్యూఢిల్లీ వైపు వెళ్లే రైళ్లను ఈ మార్గంలో మళ్లించవచ్చు. ఈ రైలు మార్గం పూర్తయితే డివిజన్ కేంద్రమైన కొవ్వూ రు రైల్వే స్టేషన్ ఇటు విజయవాడ, మరోవైపు భద్రాచలం వైపు వెళ్లే రైళ్లకు ప్రధాన రైల్వే జంక్షన్‌గా మారుతుంది. దీంతో ఇక్కడ మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఉంటుంది.

ఆర్చ్ బ్రిడ్జికి మరమ్మతులు 6

ప్లాస్టిక్ రహిత జిల్లా చేద్దాం

ఆగస్టు 15 టార్గెట్ : కలెక్టర్

రాజమహేంద్రవరం,జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా ఆగస్టు 15వ తేదీ నాటికి మార్చే దిశగా దీక్ష చేపట్టాలని.. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి. ప్రశాంతి పిలుపునిచ్చారు.కలెక్టరేట్ నుంచి శుక్రవారం మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని డివిజన్లు, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారుల వరకూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సీజ్‌చేయాలని స్పష్టం చేశారు.వ్యాపారులు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేయాలన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం కలిగించేలా విద్యార్థులతో ఇంటి వద్ద చెప్పించాలన్నారు. కాటన్ బ్యాగుల వినియోగం పెంచాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు గుడ్‌బై ..కాటన్ బ్యాగ్ వినియోగం భవిష్యత్‌కు భరోసా అనే విధానంలో ప్రచారం చేయాలన్నారు.

నేడు డీఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

రాజమహేంద్రరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యానికి వ్యతిరేకంగా శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతనాల చెల్లింపులో జాప్యంతో పాటు తలకు మించిన బోధనేతర కార్యక్రమాలు రద్దు తదితర సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.



ఆర్చ్ బ్రిడ్జికి...

రూ.70 కోట్లతో మరమ్మతులు

మూడేళ్లపాటు పనులు... రైళ్ల వేగ పరిమితి పెంపు

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి తోరణాలు కట్టినట్టుగా కనిపించే రైల్వే ఆర్చ్ బ్రిడ్జికి మరమ్మతులు మొదలుపెట్టారు. ఆర్చ్‌లకు ఉన్న దీనా హ్యాంగర్స్‌లోని వైర్లను మారుస్తున్నారు. దాదాపు రూ.70 కోట్లతో జరుగుతున్న పనులు పూర్తి కావడానికి మూడేళ్ల సమయం పడుతుంది. గతంలో దీనా హ్యాంగర్ సమస్య రాగా సుమారు రూ.కోటితో మరమ్మతులు చేశారు. ప్రతి రోజూ ఈ వంతెన మీదుగా 50 ప్రయాణికుల రైళ్లు, 40 గూడ్స్ రైళ్లు ప్రయాణిస్తాయి. ప్రయాణికుల రైళ్లకు గంటకు 80 కిలోమీటర్లు, గూడ్స్ రైళ్లకు 60 కిలోమీటర్లు వేగ పరిమితి ఉంది. అయితే పనుల కారణంగా ఆ వేగాన్ని 30 కిలో మీటర్లకు తగ్గించారు. ఈ బ్రిడ్జిపై గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకుపోయే విధంగా డిజైన్ చేసినా ఎప్పుడూ అంత వేగంతో వెళ్లలేదు.



ఆర్చ్ బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న కార్మికులు



● **ప్రత్యేకత ఇదీ**

గోదావరి నదిపై 1897లో తొలి రైల్వే బ్రిడ్జి నిర్మించారు. అది వందేళ్లు సేవలందించిన తర్వాత 1997లో మూసేశారు. దీనిని మూసి వేయడానికి ముందుగానే ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణం 1991లో మొదలైంది. 1997 మార్చి 12 నుంచి ఈ వంతెనపై రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఈ ఆర్చ్ బ్రిడ్జి చూడడానికి అద్భుతమైన నిర్మాణంగా కనిపిస్తున్నా దీనిలో గొప్ప ఇంజనీరింగ్ సాంకేతికత ఉంది. వాడుకలో ఆర్చ్ బ్రిడ్జి అని పిలుస్తున్నా దీని అసలు పేరు బౌస్ట్రింగ్-గర్డర్ బ్రిడ్జి. వంతెన నుంచి ఇనుప ఊచల మాదిరిగా కనిపించే వాటిని దీనా హ్యాంగర్లు అంటారు. ఇవి మొత్తం 600 ఉంటాయి. వీటిలో ఇనుమ తదితర లోహాలతో చేసిన వైర్లు ఉంటాయి. వాటిని బ్రిడ్జి నుంచి ఆర్చ్‌లకు అనుసంధానిస్తారు. రైలు వెళ్లే సమయంలో బ్రిడ్జిపై పడే భారం ఆ వైర్ల గుండా స్వేచ్ఛగా ప్రయాణించి ఆర్చ్‌లకు చేరుతుంది. అటు, ఇటు చివర్లకు చేరుకోవడం ద్వారా వెలుపలకు వెళ్లిపోతుంది. దీంతో బ్రిడ్జిపై రైలు వేగంగా వెళ్లే అవకాశం కలగడంతో పాటు బ్రిడ్జికి ఎలాంటి ఇబ్బందీ కలగదు.

ఇప్పుడేం చేస్తున్నారు?



ఆర్చ్‌లకు వేలాడుతున్నట్లుగా కనిపిస్తున్న దీనా హ్యాంగర్స్ లోపల వైర్లు ఉంటాయి. ఈ నిర్మాణాన్ని 25ఏళ్ల కాలానికి తగినట్టుగా డిజైన్ చేశారు. ఆ కాలం ముగిసిపోయింది. దీనా హ్యాంగర్ల లోపల ఉన్న వైర్లు ఉబ్బిపోవడంతో బయటకు కనిపిస్తున్న ఇనుప కవర్ పగిలిపోతోంది. అందువల్ల ఆ వైర్లను, బేరింగులను మార్పుచేసి, సాంకేతికతను కూడా భవిష్యత్తులో ఇబ్బంది రాని విధంగా జోడిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్పాన్ (స్తంభాలను) కూడా బాగా వెడల్పుగా నిర్మించారు. ఒక్కో స్పాన్ కనీసం 98 మీటర్లు ఉంటుంది. ఒకవేళ నాలుగో వంతెన నిర్మించా లన్నా ఇబ్బంది లేకుండా స్పాన్లలో కొంత భాగా న్ని ఖాళీగా వదిలిపెట్టారు. మనకు తోరణాల మాదిరిగా కనిపిస్తున్న ఆర్చ్‌లు మొత్తం 56 ఉన్నాయి. ఈ బ్రిడ్జి పొడవు 2.745 కిలోమీటర్లు.





డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారు

అందరికీ శుభాలను, మహిళలకు సౌభాగ్యాన్ని ఇచ్చే శ్రావణ మాసం ఆరంభమైంది. తొలి రోజే శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. కొన్నిచోట్ల సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

శ్రావణం... శుభారంభం



కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పుష్పాలంకరణలో లక్ష్మీదేవి



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో విశేష అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు





కాకినాడ జిల్లా కరప, కాకినాడల్లో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

రేపటి నుంచి ఏపీఈఏపీసెట్ తుది దశ వెబ్ కౌన్సెలింగ్

- కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు
- ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చు

జేఎన్టీయూకే, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 అడ్మిషన్లలో భాగంగా ఎంపీసీ విభాగం అభ్యర్థు లకు సంబంధించిన ఆన్‌లైన్ తుది దశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ఆదివారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈఏపీ సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ జీ.గణేష్‌కుమార్ శుక్రవారం జారీ చేశారు. మొదటి దశలో సీటు పొందని, కేటాయించిన సీటులో అడ్మిషన్ తీసుకోని విద్యార్థులు తుది దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు నమోదు చేసుకునేందుకు అర్హులు. విద్యార్థికి ఏ ర్యాంకు వచ్చినా ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చని, ధ్రువపత్రాలను పరిశీలిస్తామని కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ (ఏపీటీ) సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రిన్సిపాల్ ఎన్.జనార్దన రావు తెలిపారు. ఈ నెల 7న ప్రారంభమైన ఈఏపీసెట్ తొలి దశ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ముగియనుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సంబంధిత ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులను ఆగస్టు 4న ప్రారంభించనున్నారు.

● ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 24 ప్రైవేట్, 2 ప్రభుత్వ ఇంజనీరింగ్... మొత్తం 26 కళాశాలలకు 16,660 సీట్లు వున్నాయి. ఈఏపీసెట్‌లో ఇంజనీరింగ్‌కు కాకినాడ జిల్లాలో 6,343 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,868 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 6,011 మంది అర్హత సాధించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటాలో సుమారు 70శాతం సీట్లు భర్తీ అయినట్లు సమాచారం. మిగిలిన సీట్లను తుది దశ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నారు.

● అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలి. 99123 42010 నెంబరుకు ఫోను చేయవచ్చని సహాయ కేంద్రం సమన్వయకర్త జనార్దనరావు సూచించారు.

ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ : ఈ నెల 27 నుంచి 30 వరకు
ధ్రువపత్రాల పరిశీలన: 28 నుంచి 30 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు: 28 నుంచి 31 వరకు
వెబ్ ఆప్షన్ల మార్పు: ఆగస్టు 1
సీట్ల కేటాయింపు: ఆగస్టు 4
కళాశాలల్లో రిపోర్టింగ్: ఆగస్టు 4 నుంచి 8 వరకు

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి:

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్ టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ, ఈడబ్ల్యుఎస్, నివాసం, కులం, ఆదాయం, స్థానికత ధ్రువపత్రాలు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాబిందు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం అర్హులైన ఐటీఐ పాస్ అయిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సుధా బిందు ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, విశాఖపట్నం జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, అనకాపల్లి జిల్లాలో డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, విజయనగరం జిల్లాలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్స్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడుల్లో అప్రెంటిస్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 26 నుంచి ఆగస్టు 9వ తేదీ లోపు తమపేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వారు ఆగస్టు 11న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వారు 12న, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వారు 13న, శ్రీకాకుళం జిల్లావారు 14న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాల్సి ఉంటుందని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే ఫోన్ నెం. 08922-294906కు ఫోన్ చేయవచ్చని, ఆయా జిల్లాలప్రభుత్వ ఐటీఐల్లోని అప్రెంటిస్ అడ్వయిజరీ సిబ్బందిని కూడా సంప్రదించవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం తమ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో, దరఖాస్తుదారులకు తెలియజేసిన నిర్ణీత తేదీల్లో విజయనగరం వీటీ అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ వద్ద హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

జీఐ-ట్యాగ్‌తో ఉప్పాడ చీరలకు విస్తృత ప్రచారం

ఎంపీ సతీష్‌బాబు ప్రశ్నపై కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడి

కాకినాడ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీఐ-టాగ్‌తో ఉప్పాడ జాంధానీ చీరలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వెల్లడించారు. పార్లమెంట్‌లో శుక్రవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జీఐ-ట్యాగ్ చేసిన ఉప్పాడ జాంధానీ చీరలను ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతి వివరాలు తెలపాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రమోషన్ కోసం కేటాయించిన, ఉపయోగించిన నిధులు, జీఐ హెల్ప్‌డెస్క్ నుంచి ప్రయోజనం పొందిన నేత కార్మికులు ఉత్పత్తిదారుల వివరాలు తెలపాలని ఎంపీ అడిగారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిస్తూ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్, నేత ముద్ర పథకం కింద రాయితీ రుణాలు, ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం, ముడి పదార్థాల సరఫరా పథకం కింద అర్హత గల చేనేత ఏజెన్సీలు, అప్‌గ్రేడ్ చేసిన మగ్గాలకు కావల్సిన ఉపకరణాలు సమకూరుస్తున్నామని చెప్పారు. సోలార్ లైటింగ్ యూనిట్లు, వర్క్ షెడ్ నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి, డిజైన్, అభివృద్ధి, సాంకేతిక, సాధారణ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో 691 మంది లబ్ధిదారులను కవర్ చేసే ఉప్పాడ క్లస్టర్ అమలుకు రూ.52.78 లక్షలు ఆర్థిక సాయం అందించామన్నారు, ఆర్ఎంఎస్ఎస్ కింద 2020-21లో రూ.60.32 కోట్లు, 2021-22లో 89.53 కోట్లు, 2022-23లో రూ.139.70 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఎన్ హెచ్‌డీపీ కింద 2023-24లో రూ.186.36 కోట్లు, 2024-25లో రూ.195.50 కోట్లు, 2025-26లో రూ.112.28 కోట్లు ఖర్చు చేసినట్టు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

నేడు 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన



కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పాత బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం 6గంటలకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారితో 'బుద్ధునితో నా ప్రయాణం-డాక్టర్ అంబేడ్కర్ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు నాటక ఆహ్వాన కమిటీ కన్వీనర్ పి.రామారావు కోరారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎస్పీ బిందుమాధవ్ హాజరవుతారన్నారు. సమావేశంలో ఎన్.పెద్దిరాజు, కె.రామారావు, జి.కింగ్, బి.కుమార్, కె.మౌర్య పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.5.36 లక్షలు



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,36,450 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

రేపు ఎయిడెడ్ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సీబీటీ

పాఠశాల విద్య జోన్-2 కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నాగమణి

సర్పవరం జంక్షన్(కాకినాడ)/రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జోన్-2 పరిధిలోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్తేర్ ఎగ్గిన్ రెసిడెన్సియల్ ఎయిడెడ్ ప్రాథమిక స్కూలు, కొంతమూరు, ఎస్తేర్ ఏగ్గిన్ రెసిడెన్సియల్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్ జీటీ, స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్టుల భర్తీకి ఈనెల 27న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య జోన్-2 కాకినాడ ఆర్‌జేడీ జి.నాగమణి ఓ ప్రకటనలో తెలిపారు. సీబీటీ మొదటి సెషన్ ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు జరుగుతుందన్నారు. కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్- ఐడీజడ్, రాజమహేంద్రవరం లూథర్‌గిరి సెంటర్లలో సీబీటీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 98485 74622, 83091 77952 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరిలో మొత్తం 1249 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో శ్రీకోట్ల వెంకటరామయ్య బాలికోన్నత పాఠశాల ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచింగ్ పోస్టులకు ఈనెల 27న సీబీటీ నిర్వహించనున్నట్టు చెప్పారు. హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ కోసం 99892 71919 ఫోన్ చేసి సమాచారం పొందాలని కోరారు. ఈ పోస్టుల కోసం ఆన్‌లైన్,ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో దరఖాస్తు చేసుకున్న వారు cse.ap.gov.in / aidedhallticket ద్వారా హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.పరీక్షా కేంద్రాలకు 90నిమిషాల ముందు గుర్తింపు పొందిన ధ్రువపత్రంతో హాజరు కావాలని ఆర్‌జేడీ కోరారు.

సముద్ర తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేస్తాం



ఉప్పాడ తీరాన్ని పరిశీలిస్తున్న దేవులనాయక్

కొత్తపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సముద్ర కోత తీవ్రతను ప్రభుత్వానికి తెలియజేస్తామని పౌరసరఫరాల శాఖ మేనేజరు, కొత్తపల్లి మండల ప్రత్యేకాధికారి ఎం.దేవులనాయక్ చెప్పారు. రెండు రోజుల క్రితం సముద్రం ఉప్పొంగడంతో మాయాపట్నంలో నిరాశ్రయులైన మత్స్యకారుల కుటుంబాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లడం తప్ప సముద్ర కోతను పూర్తిగా నివారించలేకపోతున్నారని పలువురు మత్స్యకారులు ప్రత్యేకాధికారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులకు జరిగిన నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని నాయక్ తెలిపారు. ఆయన వెంట కొత్తపల్లి తహశీల్దారు జి.చిన్నారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వున్నారు.

26, 28, 30 తేదీల్లో 20 రైళ్లు రద్దు

- తాడి-దువ్వాడ మధ్య నాన్‌ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనులు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



ఎల్‌హెచ్‌బీ బోగీలతో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే సెక్షన్ పరిధిలో తాడి-దువ్వాడల మధ్య నాన్‌ఇంటర్ లాకింగ్, ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో ఈ నెల 26, 28, 30 తేదీలలో 20 రైళ్లను రద్దు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు విజయవాడ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారికి శుక్రవారం రాత్రి అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

● సామర్లకోట జంక్షన్ రైల్వే స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే 12717 నెంబరు గల విశాఖ-విజయవాడ మధ్య రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 67285 నెంబరు గల రాజమహేంద్రవరం-విశాఖల మధ్య మెము ప్యాసింజరు ఈ నెల 26, 28, 30 తేదీలలో రద్దు కానున్నాయి.

● 12718 నెంబరు గల విజయవాడ-విశాఖ మధ్య రత్నాచల్ ఎక్స్ ప్రెస్ ఈనెల 26, 28, 30 తేదీల్లో రద్దు కానుంది.

● 22875, 22876 నెంబర్లు గల గుంటూరు-విశాఖ-గుంటూరు మధ్య ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, 30 తేదీలలో రద్దు కానున్నాయి.

'రత్నాచల్'కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

విజయవాడ-విశాఖ మధ్య తిరిగే 12718, 12717 నెంబర్ల రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆగస్టు 8 నుంచి అధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీలను ఏర్పాటు చేస్తున్నట్టు విజయవాడ రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారం ప్రకారం.. మార్పు చేసిన ఈ ఎల్‌హెచ్‌బీ బోగీలలో జనరల్ కేటగిరికి చెంది 8 బోగీలు, ఛైర్‌కార్ 8 బోగీలు, ఏసీ ఛైర్‌కార్ 3 బోగీలు, ప్యాంట్రీ కార్ బోగీ ఒకటి, ఈవోజీ ఒకటి, ఎల్ఎస్ఎల్ఆర్‌డీ ఒకటి చొప్పున 22 బోగీలతో విజయవాడ- విశాఖ మధ్య రాకపోకలు సాగించనుంది.

29, 3 తేదీల్లో ఆర్టీసీ తీర్థయాత్ర స్పెషల్స్



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా శ్రావణమాస స్పెషల్ ఒకరోజు తీర్థయాత్ర ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతున్నట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఈనెల 29, ఆగస్టు 3వ తేదీల్లో ఈ స్పెషల్ బస్సులు ప్రారంభమవుతాయన్నారు. స్పెషల్ బస్సులు ఉదయం 5గంటలకు రాజమహేంద్రవరం డిపో నుంచి బయలుదేరి తిరిగి రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటాయని తెలిపారు. నిడదవోలు కోట సత్తెమ్మ అమ్మవారు, కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారు, భీమవరం మావుళ్లమ్మ తల్లి, యనమదులూరు పార్వతి సమేత శక్తీశ్వరస్వామి, కాళ్లకూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆచంట బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, నత్తా రామేశ్వరం రామేశ్వరస్వామి (త్రిలింగ క్షేత్రం), పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం దర్శించుకోనున్నట్టు పేర్కొన్నారు. టిక్కెట్టు ధర ఒక్కరికి రూ.500గా నిర్ణయించామని, టిక్కెట్లు కావాల్సిన వారు సెల్ నెంబర్లు 95023 00189, 73829 12141లలో సంప్రదించాలని డిపో మేనేజర్ కె.మాధవ్ కోరారు.

నూతన ఎంపీడీవోలకు ప్రత్యేక శిక్షణ తరగతులు

● 28 నుంచి ప్రారంభం ● విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ ప్రసాదరావు



సామర్లకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో నూతనంగా పదోన్నతులు లభించిన 46 మంది ఎంపీడీవోలకు నెల రోజుల పాటు జరిగే ప్రాథమిక శిక్షణ తరగతులు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నట్టు విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కెఎన్వీ ప్రసాదరావు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెంది నూతనంగా పదోన్నతులు పొందిన 89 మంది ఎంపీడీవోలకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులు రెసిడెన్షియల్ పద్ధతిన నెల రోజుల పాటు జరుగనున్నట్టు తెలిపారు. మొదటి బ్యాచ్ తరగతులకు 46 మంది ఈ నెల 28నుంచి హాజరుకానున్నట్టు తెలిపారు. రెండో బ్యాచ్‌లో 43 మంది నెల రోజుల పాటు శిక్షణ పొందుతారన్నారు. పంచాయతీ విస్తరణాధికారులు, పరిపాలనాధికారులుగా పనిచేసిన వీరందరికీ ఇటీవల ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో వివిధ అంశాల్లో నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ తరగతులు నిర్వహించేలా రూపొందించామన్నారు. శిక్షణలో పాల్గొనే ఎంపీడీవోలకు వసతి, బస తదితర సదుపాయాలు శిక్షణాకేంద్ర ఆవరణలోనే ఏర్పాట్లు చేసామని ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు.

పరామర్శకు పయనం.. అంతలోనే ప్రమాదం!

- ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్‌బస్సు
- అక్కడికక్కడే ముగ్గురు మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో తల్లీ కూతురు



సంఘటనా స్థలంలో మృతదేహాలు, ఆటో



మృతిచెందిన తల్లి దుర్గ, కుమార్తె భవాని (ఫైల్)





ఆటోడ్రైవర్ కుమార్ మృతదేహం, ఫైల్

తాళ్లరేవు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ముగ్గురుఅక్కడికక్కడే మృతిచెందారు. కోరింగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగ నుంచి పోతాబత్తుల దుర్గ(50), కుమార్తె లంకె భవాని (28), వారి బంధువు ఓలేటి లక్ష్మి తాళ్లరేవు మండలం గాడిమొగ పంచాయతీ పరిధి చినవలసల గ్రామంలో ఉన్న దుర్గ మరో కుమార్తె సంగాడి సత్యవతి భర్త గంగరాజు కంటి ఆపరేషన్ చేయించుకోవడంతో పరామర్శించేందుకు శుక్రవారం కాకినాడ నుంచి ఆటోలో బయలుదేరారు. ఆటో తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ రామన్నపాలెం వచ్చేసరికి యానాం నుంచి కాకినాడకు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఎదురుగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న తల్లి, కూతురు దుర్గ, భవానితో పాటు యానాం కురసాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కురాకుల కుమార్(22)అక్కడికక్కడే మృతిచెందారు. లక్ష్మికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మృతదేహాలను అంబులెన్స్‌లో కోరింగ పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ రూరల్ సీఐ చై తన్యకృష్ణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోరింగ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్ బస్సును కోరింగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సత్యదేవుడి ఆవిర్భావ వేడుకలు

ఘనంగా ప్రారంభం

నేడు ప్రత్యేక పూజలు



స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి 135వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అనివేటి మండపంలో స్వామి,అమ్మవార్లను వెండి సింహాసనంపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం రుత్విక్‌లకు దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు. రుత్విక్‌వరుణలు జపములు, పారాయణలు, సూర్యనమస్కారములు, కలశస్థాపన గావించారు. సాయంత్రం 3.30కి అగ్నిప్రతిష్ఠాపన పవమాన హోమములు నిర్వహించారు. స్వామివారు శ్రావణ శుద్ధ విదియరోజున రత్నగిరిపై ఆవిర్భవించారు. దీనిలో భాగంగా శనివారం శ్రావణశుద్ధ విదియ సందర్భంగా వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లకు సుప్రభాతసేవ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకములు, పంచామృతాభిషేకములు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9గంటలకు ఆయుష్యహోమం ప్రారంభించి 11గంటలకు పూర్ణాహుతి గావిస్తారు. అనంతరం ఉదయం స్వామి, అమ్మవార్లకు వెండిరథంపై ప్రాకారసేవ, రాత్రికి గరుడవాహనంపై గ్రామసేవ జరుగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో చండీహోమం జరిగింది. అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బతికుండగానే బలి...!

- ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో తప్పుడు సమాచారం
- చనిపోయినట్టు ఉండడంతో ప్రభుత్వ పథకాలకు దూరం
- లబోదిబోమంటున్న ఆదివాసీలు



ఆన్‌లైన్ డేటాలో మృతిచెందినట్టు చూపుతున్న బాధితులు

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వారంతా బతికే ఉన్నారు. ఐతే ఆన్‌లైన్ డేటాలో వారిని చంపేశారు. డేటా ఎంట్రీ తప్పు వల్ల వారంతా ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం చిడుమూరు గ్రామ పంచాయితీ చిడుమూరు, జువ్విగూడెం, బుర్కనకోట గ్రామాల్లో పలు కుటుంబాలు డేటా ఎంట్రీదారుల నిర్లక్ష్యానికి బలయ్యారు. చిడుమూరుకు చెందిన మోసం రుతు వయస్సు 17ఏళ్లు. డేటా ఎంట్రీలో మృతి చెందినట్టు చూపడంతో పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. జువ్విగూడెనికి చెందిన ముర్రం మీన, సోడె రంగమ్మ, ముర్రం తిరుపతమ్మ, బుర్కనకోటకు చెందిన కుంజా ముత్తమ్మ, చిడుమూరుకు చెందిన సవలం నాగమ్మ వితంతువులు. భర్తలు కాలం చేయడంతో చేతి కష్టంతో బతుకుసాగిస్తున్నారు. ఐతే వారందరినీ డేటా ఎంట్రీలో చంపేశారు. దీంతో వీరంతా వితంతు పింఛనకు దూరమయ్యారు. అదే దశలో జువ్విగూడెనికి చెందిన కుంజా ఏసుబాబు, ముర్రం రాజు పేర్లు కూడా డేటా ఎంట్రీలో లేకపోవడంతో రేషను పొందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బాధితులంతా ఎన్నో రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఎవరూ పరిష్కారం చూపడంలేదు. దీంతో నష్ట పోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. మరి తమ గోడును పట్టించుకునేదెవరని బాధితులు వాపోతున్నారు.

యూసీఈకేలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

35 మంది విద్యార్థులు ఎంపిక



వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అధికారులతో ఎంపికైన విద్యార్థులు

జేఎన్టీయూకే, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యూసీఈకేలో 2 రోజులు నిర్వహించిన ఎండేవా కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ నుంచి 130 మంది పాల్గొనగా 35 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను డాక్టర్ అరవ కరుణ, ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు నిర్వహించగా ఎంపికైన విద్యార్థులను వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయభాస్కర్ అభినందించారు.

ఉధృతంగా శబరి

చింతూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు వద్ద శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. 3 రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకల్లో చేరిన వర్షపు నీరు చివరకు శబరిలో కలిసి ఉధృతంగా మారింది. భద్రాచలంలో శుక్రవారం సాయంత్రానికి గోదావరి ప్రవాహం 25 అడుగుల మేర ప్రవహిస్తోంది. సోమవారం సాయంత్రానికి 30 అడుగుల ప్రవాహానికి చేరుకునే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యూసీ అంచనా వేస్తోంది.



చింతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి

'అన్నవరం'లో అవకతవకలు.. ఈవో చర్యలు

రూ.30 లక్షలు నకిలీ పీఎఫ్ చలానాలకు సంబంధించి ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

రూ.84 లక్షల జీఎస్టీ వసూలులో నిర్లక్ష్యం వహించిన నలుగురికి నోటీసులు

అన్నవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో జరుగుతున్న అవకతవకలు దీనివెనక ఉన్న పాత్రధారులపై చర్యలకు ఈవో వీర్ల సుబ్బారావు ఉపక్రమించారు. ఇటీవల దేవస్థానం శానిటరీ కాంట్రాక్టర్ కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థ కార్మికులకు పీఎఫ్ చెల్లించకుండా రూ.30 లక్షలు నకిలీ చలానాలను అందించి దేవస్థానం నుంచి బిల్లులు పొందడం కార్మికుల ఫిర్యాదుతో విషయం బయటపడింది. దీంతో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థపై దేవస్థానం ఫిర్యాదుచేయగా దీనిలో బాగస్వామ్యం అయిన దేవస్థానం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ మురాలశెట్టి రామకృష్ణను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఈవో ఉత్త ర్వులు జారీ చేశారు. మార్చి నెలలో సూపరెంటెండెంట్‌గా విధులు నిర్వహించి ప్రస్తుతం సింహాచలం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న బలువు సత్యశ్రీనివాస్‌కు చార్జిమెమో ఇచ్చారు. దేవస్థానంలో 2023 నుంచి టోల్‌గేట్ లీజుదారు నుంచి జీఎస్టీ, లీజు బకాయి సుమారు రూ.84 లక్షలు వసూలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన అప్పటి సూపరెంటెండెంట్ కిషోర్, ప్రస్తుతం సెలవులో ఉన్న సీనియర్ అసిస్టెంట్ వోలేటి జగన్నాథానికి చార్జిమెమో, ప్రస్తుత లీజుల విభాగం సూపరెంటెండెంట్ పీవీ.రమణ, జూనియర్ అసిస్టెంట్ వనపర్తి రమేష్‌ను దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆలయ ఈవో ఒక్కసారిగా ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారగా దేవస్థానం ఉద్యోగుల్లో గుబులు రేకెత్తిస్తోంది.

220 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్ట్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తూ భారీగా గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ వంతెన రోడ్‌లోని నయారా పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రిజిస్ట్రేషను నంబరుతో ఉన్న ఇన్నోవా వాహనంలోని వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారులో 10 బస్తాల గంజాయిని గుర్తించారు. వాటిలోని 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన నాగరాజు, సుబ్రహ్మణ్యం, జైసల్యాను అదుపులోకి తీసుకున్నామని హనుశ్రీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్త్‌స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యక్తిని గంజాయితో అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ర్యాలికి చెందిన పువ్వల మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారం మేరకు ఎస్ఐ రాము సిబ్బందితో శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రమూర్తి, వీఆర్వో, వీఆర్‌ఏ సమక్షంలో రాము వద్ద నుంచి 470 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో మరో ఆరుగురిని అరెస్టు చేయాల్సి ఉందని, వారు పరారీలో ఉన్నారన్నారు.



ర్యాలిలో గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌లకు రూ.19లక్షలు విరాళం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టర్ షాన్‌మోహన్‌కు రూ. 15 లక్షల చెక్కు ఇస్తున్న అరబిందో ప్రతినిధులు



కలెక్టర్‌కు రూ. 4లక్షల చెక్కును ఇస్తున్న ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో కాకినాడలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్‌లకు శుక్రవారం రూ.19 లక్షలు విరాళాలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెండు సంస్థల నుంచి ఆయన చెక్కులను స్వీక రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిలో అరబిందో ఫార్మ ఫౌండేషన్ నుంచి సీఎస్ఆర్ నిధుల కింద రూ.15లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. అలాగే కాకినాడ ఆదిత్య విద్యా సంస్థలు రూ.4లక్షలు విరాళంగా ఇచ్చాయన్నారు. కాకినాడలో నిర్వహిస్తున్న ఈ రెండు కార్య క్రమాలకు విరాళాలు ఇచ్చిన అరబిందో ఫార్మ ఫౌండేషన్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ జీఎం ఎ.శ్రీనివాస్, సీఎస్ఆర్ జీఎం సుధాకర్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు సుగుణరెడ్డి, శృతిరెడ్డిలు పాల్గొన్నారు.

మావోయిస్టు దళ సభ్యురాలు లొంగుబాటు



లొంగిపోయిన దళ సభ్యురాలికి ప్రోత్సాహకాన్ని అందిస్తున్న ఓఎస్డీ, అధికారులు

ఎటపాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలానికి చెందిన సీపీఐ మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు కొవ్వాసి దేవే అలియాస్ సుమిత్ర పోలీసులు ఎదుట లొంగిపోయినట్టు ఓఎస్డీ జగదీష్ అడహిళ్లీ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా కొంటా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగరాజపాడుకిచెందిన దేవే 22 ఏళ్ల వయసులో ఏరియా కమిటీ సభ్యుడు, కొంటా ఎల్‌వోఎస్ కమాండర్ మడకం కోసిని ఆదర్శంగా తీసుకుని దళంలో చేరినట్టు చెప్పారు. 2024 జనవరిలో ఈమెతో పాటు మడివి హిడ్మా బెటాలియన్ కమాండర్‌తో పాటు 900 మంది దళ సభ్యులు ఛత్తీస్‌గడ్‌లోని ధర్మవరం పోలీస్ క్యాంపుపై దాడిలో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. లొంగిపోయిన దేవే పై రూ.లక్ష రివార్డు ఉందని ఓఎస్డీ తెలిపారు. ఈయనతో పాటు సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు ఉన్నారు.

పురుగుల మందుల దుకాణంలో తనిఖీలు

గొల్లప్రోలులో రూ.1.14 లక్షల విలువైన స్టాక్ సీజ్

గొల్లప్రోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని పురుగుల మందు దుకాణం హనుమాన్ ట్రేడర్స్‌లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపుపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో దుకాణం నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంతో 2రోజుల క్రితం అధికారులు సీలు వేశారు. శుక్రవారం సీలు తొలగించి తనిఖీలు జరపగా స్టాకు నిల్వలు, రిజిస్టర్లకు తేడాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో రూ.1,14,625 విలువైన పురుగు మందుల స్టాకును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు పంపుతున్నట్టు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు, పిఠాపురం వ్యవసాయ అధికారులు కేవీవీ సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

కొమురం భీం విగ్రహం ధ్వంసం కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

కూనవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కొమురం భీం విగ్రహ ధ్వంసం కేసులో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ లతాశ్రీ కథనం ప్రకారం... ఈనెల 9న అర్ధరాత్రి కొమురం భీం విగ్రహం వద్ద ఫొటోలు తీసుకునేందుకు ముగ్గురు వెళ్లి తుంటరి చర్యలకు పాల్పడ్డారు. ఓ వ్యక్తి సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించగా విగ్రహం చేయి ధ్వంసం అయింది. దీంతో వారు అక్కడి నుంచి భయంతో వెళ్లిపోయారు. ఈనెల 11న ఆదివాసీ నాయకులు కుంజా అనిల్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి శుక్రవారం ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్టు తెలిపారు. ముగ్గురిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు శిక్ష

రాజమహేంద్రవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సుమ స్కూల్, రాజానగరంలోని సుమ రిఫైనరీలో డైరెక్టర్‌గా ఉన్న ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగకుమారి వేసిన వెంచర్‌లో నగరానికి చెందిన ముళ్లపూడి లలితాదేవి స్థలాల కొనుగోలుకు రూ.15లక్షలు అడ్వాన్సుగా ఇచ్చారు. అయితే ఆమె ఓ ఒప్పందం ఉల్లంఘించడంతో లలితాదేవి నిలదీయగా ఆమెకు రూ.19లక్షలు చెక్కు ఇచ్చారు. చెక్కు బౌన్స్ కావడంతో లలితాదేవి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రూ.33,09,325 నగదును 9% వడ్డీతో లలితాదేవికి చెల్లించడంతోపాటు నాగ కుమారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

తీరం.. కోత భారం!





కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో అలల ఉధృతి కారణంగా ఉప్పాడ, సూరాడపేట, మాయపట్నం గ్రామాల్లో మత్స్యకారుల ఇళ్లు కోతకు గురికావడంతో వారి మనసులు ఎంతో భారంగా మారాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

అపరిచితులతో చాటింగ్ చేయొద్దు: డీఎస్పీ

బిక్కవోలులో గంజాయి, సైబర్ నేరాలు, మహిళల భద్రతలపై అవగాహన సదస్సు



బిక్కవోలులో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్, స్కైప్‌లో అపరిచితులతో చాటింగ్ చేయవద్దని ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య పేర్కొన్నారు. బిక్కవోలులోని శ్రీప్రజ్ఞా కళాశాల, ఊలపల్లి అంగన్వాడీ కేంద్రంలో సైబర్ నేరాలు, గంజాయి, మహిళల భద్రతపై డీఎస్పీ బి.విద్య, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహిళలు, బాలికల రక్షణకు మహిళా చట్టాల ద్వారా కల్పిస్తున్న హక్కులు, స్వీయ రక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనవసర లింక్‌లు, అప్లికేషన్లను క్లిక్ చేయడం వల్ల కలిగే అనర్థాల వివరించారు. ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ మాట్లాడుతూ గంజాయి, చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని, అటువంటి నేరస్తుల కదలికల గూర్చి సమాచారం ఇవ్వాలన్నారు. ఓటీపీ ఫ్రాడ్, ఏటీఎం కార్డు క్లోనింగ్ ఫ్రాడ్లపై అప్రమత్తంగా వుండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరస్తుల వద్దకు చేరకుండా ఎలా భద్రపరచుకోవాలో అనే అంశంపై మెళకువలను సైబర్ పోలీసులు నేర్పించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1960 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ. సురేష్, పి.దుర్గాప్రసాద్, డి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో విభేదాలు సృష్టించాలనుకోవడం భ్రమ

జనసేన అనపర్తి కోఆర్డినేటర్ నాగు

అనపర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కూటమిలో విభేదాలు సృష్టించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పన్నాగాలు పన్నుతున్నారని, అదంతా ఆయన భ్రమ మాత్రమేనని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రావాడ నాగు అన్నారు. శుక్రవారం రాత్రి అనపర్తిలోని కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జనసేన నాయకులను కలుపుకోవడం లేదంటూ పోస్టులు పెట్టడం అవివేకమన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టే పనులు మానుకోవాలన్నారు. సమావేశంలో ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, ఇందల వీరబాబు, కొండయ్య, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించండి

బ్రిడ్జికౌంటీ వాసుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న బ్రిడ్జ్ కౌంటీ నివాసితులు

రాజానగరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలో చక్రద్వారబంధం పంచాయతీ పరిధిలోని బ్రిడ్జ్ కౌంటీలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ 2013లో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఆవిర్భవించిన బ్రిడ్జ్ కౌంటీ టౌన్‌షిప్‌లో పార్కు, షాపింగ్ కాంప్లెక్స్, క్లబ్ జిమ్, స్విమ్మింగ్ పూల్, తాగునీటి సదుపాయం, 24 గంటల సెక్యూరిటీ, విశాలమైన రోడ్డు, పారిశుధ్య నిర్వహణ సౌకర్యాలు కల్పిస్తామని గతంలో గొప్పలు చెప్పారని, దశాబ్దం గడిచినప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జికౌంటీలో కనీస సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ మహదేవ్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, సెక్రటరీ దాసు, జాయింట్ సెక్రటరీ వెంకటరావు, రామకృష్ణ, నవోదయ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామర్లకోట కాలువలో గుర్రపు డెక్క తొలగింపు

బిక్కవోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కాలువలో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం శుక్రవారం నాటికి 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆర్ఎస్. పేట వద్ద కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ పనులు పర్యవేక్షణకు వచ్చిన గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాలువల్లో పేరుకు పోయిన గుర్రపుడెక్క, తూడు తొలగించడం మరచిపోయిందని, దీంతో శివారు భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో కడియం నుంచి జి.మేడపాడు వరకూ గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో బలభద్రపురం నీటి సంఘ అధ్యక్షుడు దత్తుడు సుబ్బారెడ్డి, నాయకులు మాడా మోహన్, బోను సూర్యకుమార్, ఏఈ షైనీ వున్నారు.

కుతుకులూరులో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుతుకులూరులో సంజీవ్, జాజి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన మండపేటకు చెందిన డాక్టర్ బిక్కిన గోపాలకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా 164మంది దాతలు రక్తదానం చేశారు. అంతకుముందు గ్రామంలో నిర్వహించిన రక్తదాన అవగాహన ర్యాలీలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మీసాల రమాదేవి, తాడి రామగుర్రెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి, కర్రి సంజీవ్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో కేంద్ర బృందం పర్యటన


అనపర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్వహణపై శుక్రవారం మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో కేంద్ర ప్రతినిధుల బృందం పర్యటించింది. ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూడు బృందాలుగా పొలమూరు, కొప్పవరం, మహేంద్రవాడ గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం కోఆర్డినేటర్ బి.పద్మిని మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ పారిశుధ్య అంశాలను గుర్తించి కేంద్రానికి నివేదిస్తామని, మరుగుదొడ్లు, డ్రైనేజీలు, పరిసరాల పరిశుభ్రతలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నాగ సుబ్రహ్మణ్యం, డీపీవో కార్యాలయ రిసోర్స్‌పర్సన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజనీ

కోరుకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి):భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోరుకొండ గ్రామానికి చెందిన మద్దిపాటి రజని నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.నాగేంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఇంత వరకు రజనీ బీజేపీ మహిళా విభాగం జిల్లా నాయకురాలిగా చురుగ్గా పని చేశారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో రజనీకి మంచి సంబంధ బాంధవ్యాలున్నాయి. పార్టీకి ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆమె శుక్రవారం కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె నియామకం పట్ల బీజేపీ రాజానగరం ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, మండలాధ్యక్షుడు అడపా సుధీర్‌కుమార్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆడిట్ సక్రమంగా నిర్వహించాలి

డీఆర్‌డీఏ పీడీ మూర్తి



ఆడిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

కడియం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలకు సంబంధించి జరుగుతున్న ఎక్స్‌టెర్నల్ ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించాలని ఆడిట్ అధికారులకు, జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ మూర్తి తెలిపారు. కడియం మహిళా స్త్రీశక్తి భవనాన్ని ఆయన శుక్రవారం సందర్శించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి జరుగుతున్న ఆడిట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీపీఎం ఎ.శ్రీనివాసరావు, ఏపీఎం నాగలక్ష్మి, సీసీలు ఎం.నాగభూషణం, యూబీజీ తిలక్, బి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అదుపు తప్పితే అంతే!

- సీతానగరంలో గోతులమయమైన ప్రధాన రహదారులు
- ప్రమాదాల బారిన వాహనాలు
- గాయాలపాలవుతున్న ప్రయాణికులు



గురువారం రాపాక -కోటికేశవరం రోడ్డులో దిగబడిన లారీ

సీతానగరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపాక, కోటికేశవరం, పురుషోత్తపట్నం-సీతానగరం, రఘుదేవపురం-సీతానగరం, చినకొండేపూడి-నాగంపల్లి రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లు శిథిలమై భారీ గోతులు పడి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. రోజూ ఏదో ఒక ప్రమాదం ఈ రోడ్లలో జరుగుతూనే ఉంది అయినా అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాపాక-కోటికేశవరం రహదారిలో కోటికేశవరం నుంచి సీతానగరం వైపు లోడుతో వెళుతున్న లారీ రోడ్డు గోతిలో పడి కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా బయటకు రావపోవడంతో లారీని డ్రైవర్ అక్కడే వదలేసి వెళ్ళిపోయాడు. దీనిని బయటకు తియ్యాలంటే లారీలో ఉన్న లోడ్ మొత్తం కిందకు దించి ప్రొక్లైనర్ సహాయంతో లారీని బయటకు తీయవలసి ఉంది. ఈ రహదారిలో ఇలాంటి సంఘటనలు తరచూ అనేకం జరుగుతున్నాయి. ఒకేసారి రెండు వాహనాలు ఎదురుపడి తప్పించుకోవలసి వస్తే అంతే సంగతులు. చక్రాలు బెర్మ్ ప్రాంతంలోకి వెళ్లి కూరుకుపోవడమో లేక ఆ రోడ్డులోనే ఉన్న గోతుల్లో పడి బోల్తా పడడమో జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మండలంలో మరమ్మతులకు గురైన రహదారులను బాగుచేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు

నీరే జీవనాధారం

- కేంద్ర భూగర్భ జల బోర్డు ప్రాంతీయ డైరెక్టర్ జ్యోతికుమార్
- 'నన్నయ'లో భూగర్భ జలాల స్థిరత్వంపై ముగిసిన శిక్షణ



వీసీ ప్రసన్నశ్రీని అభినందిస్తున్న బోధనా సిబ్బంది

దివాన్‌చెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నీరే జీవనాధారమని కేంద్ర భూగర్భ జల బోర్డు ప్రాంతీయ డైరెక్టర్ ఎన్.జ్యోతికుమార్ అన్నారు. నన్నయ వర్శిటీలో కేంద్ర భూగర్భ జల బోర్డు దక్షిణ ప్రాంతం వారు మూడురోజులుగా నిర్వహిస్తున్న భూగర్భ జలాల స్థిరత్వ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జ్యోతికుమార్ క్షేత్రస్థాయిలో వాటర్ లెవిల్ మోనటరింగ్ విధానాలు, నీరు కాలుష్యం కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి ఎం.సత్యనారాయణ వాతావరణ మార్పులు-భూగర్భ జలాల మార్పులపై ప్రసంగించారు. ప్రభుత్వం భూగర్భ జల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను తెలిపారు. కార్యక్రమంలో యూనివర్శిటీ జియో సైన్సెస్ విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అధ్యాపకులు నూకరత్నం, కె.ఎస్.పీటర్, కె.సుధారాణి, డి.తేజ, జి.అప్పారావు పాల్గొన్నారు.

నన్నయ వీసీకి అభినందనలు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఇటీవల ఆచార్య ఆర్.సుబ్బకృష్ణ స్మారక అవార్డు అందుకున్న సందర్భంగా విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల బోధనా సిబ్బంది శుక్రవారం ఆమెకు అభినందనలు తెలిపారు. వీసీ ఛాంబర్‌లో కలసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుని యూనివర్శిటీ ఔన్నత్యాన్ని మరింత పెంచుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, వివిధ శాఖాధిపతులు కె.రమణేశ్వరి, టి.హైమావతి, కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వాలిడేషన్ చట్టాన్ని రద్దుచేయాలి

రాజమహేంద్రవరంలో పెన్షనర్ల నిరసన



పుష్కరాల రేవు వద్ద నిరసన చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేసి అందరికీ ఒకేలా పే కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నిరసన నిర్వహించింది. రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం వాలిడేషన్ ఆఫ్ సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) రూల్స్ ప్రిన్సిపుల్స్ ఫర్ ఎక్స్‌పన్డీచర్ ఆఫ్ పెన్షన్స్ పేరుతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 309ను అనుసరించి 2023లో కొన్ని మార్పులను చేస్తూ 2025లో పార్లమెంట్‌లో ఆమోదించారని దీని వల్ల పెన్షనర్లు కమిషన్ అమలుకు ముందు రిటైరైన వాళ్లు, అమలు తర్వాత రిటైరైన వాళ్లు అని విభజింపబడ్డారని తెలిపారు. ఫలితంగా పే కమిషన్‌కు ముందు రిటైరైన ఉద్యోగులకు గతంలో మాదిరిగా పెన్షన్ రివిజన్ అడిగే హక్కు కోల్పోతారని, పాత పెన్షన్ మీదే శేషజీవితం గడపాల్సి వస్తుందన్నారు. ఎప్పటికీ వారి పెన్షన్‌లో డీఏలు తప్ప ఇతరాత్ర పెరుగుదల ఉండదన్నారు. రెండు వర్గాలుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. శివ కమిషన్ ప్రతిపాదనలను పెన్షనర్లందరికీ ఒకేలా అమలు చేయాలని, 8వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు కె.భాస్కరరావు, బీఎస్ఎన్ఎల్ తరపున ఆర్ఎస్ ఎస్ మూర్తి, కె.సన్యాసిరావు, ఏవీవీ సత్యనారాయణ, పోస్టల్ తరపున డి.తిరుపతిరావు, ఎంవీ రత్నం, సీహెచ్ ధర్మరాజు, ఎస్ఎన్‌పీఏడబ్ల్యూఏ నుంచి ఎస్ఎస్ఎన్ రెడ్డి, కేఎస్ఎస్ రాజు, చిక్కాల వెంకటరావు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



రాజమహేంద్రవరం ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ పిల్లలు

రాజానగరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులపై ఉందని ఎంపీడీవో జేపీ ఝాన్సీ అన్నారు. ఈ మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో టాంటాం వేయడం, దుకాణాలకు నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించేలా చూడాలన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థుల ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక 21వ వార్డు ఉల్లితోట అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త సాయిబిందు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పిల్లలతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వాడకం మానుకోవాలని చెప్పడమే కాకుండా, వాటిని సేకరించి ప్రత్యామ్నాయంగా వాడవలసిన పర్యావరణ సహిత బ్యాగులను పిల్లలతో ఇంటింటికీ పంపిణీ చేయించారు.

జాతీయ హోమియోపతి అకాడమిక్ సభ్యురాలిగా అనురాధ

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ హోమియో వైద్యురాలు డాక్టర్ కె.అనురాధ భారతీయ హోమియో అకాడమిక్ కమిటీ సభ్యురాలిగా జాతీయ స్థాయిలో ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక జరిగినట్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి వీవీకే సతీష్. అనురాధకు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. కాగా ఈమె 1997-98లో జిల్లా హోమియోపతి వైద్యుల సంఘానికి అధ్యక్షురాలిగా వ్యవహరించారు. అనంతరం స్నాతకోత్సవ విద్యను సాధించారు. వీరి ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయంగా అనేక పత్రాలను హోమియో వైద్యంపై సమర్పించారు. ఆంధ్ర కేసరి యువజన సమితిలో అనురాధ కీలక పాత్ర వహిస్తున్నారు. హోమియో అకాడమిక్ కమిటీ సభ్యురాలిగా ఎంపికైన డాక్టర్ అనురాధకు ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్షుడు వి.భాస్కరరామ్,ప్రధాన కార్యదర్శి సీపీ రెడ్డి, పలువురు నగర ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

23 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడి కార్పొరేట్ వైద్యం పొందికోలుకున్న 23 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.11,65,449 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో టింబర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి బాధితులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకుని చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఇప్పటి వరకు 149 మందికి సీఎం సహాయ నిధి ద్వారా సుమారు రూ2 కోట్ల చెక్కులను అందిచామని, ఈ 23 మందితో కలిపి మొత్తం 172 మందికి రూ.2.10 కోట్లు అందించామన్నారు. ఇంకా 64 మందికి పెండింగ్‌లో వుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై.శ్రీను, నందివాడ దినేష్, నల్లం శ్రీను, జక్కంపూడి అర్జున్ ,శెట్టి జగదీష్, సలాది ఆనంద్, చింతపల్లి నాని, జోగి నాయుడు, కానేటి ప్రభుదాస్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన శ్రావణమాసం

అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు

కోరుకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన, పవిత్రమైన శ్రావణమాసం ఈ సంవత్సరం శుక్రవారంతో ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని మహిళలంతా సాంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద, శ్రీ భూవేంకటేశ్వర ఆలయం, ఆర్యవైశ్య కోదండ రామాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, గాదరాడ ఓం శివశక్తి పీఠంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కోరుకొండ హరేరామ సమాజం వద్ద మహిళా బృందం లలితా సహస్రనామ పారాయణం చేశారు.

ప్రకృతి సాగుతో దిగుబడులు

దేవరపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ డీఆర్‌సీ ఏవో వెంకన్నబాబు అన్నారు. దేవరపల్లిలో గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి, ఉద్యానవన వ్యవసాయ శాఖల సిబ్బందికి ఇస్తున్న శిక్షణ రెండో రోజూ కొనసాగింది. యాదవోలులో ప్రకృతి ద్వారా పండించే పంటలను పరిశీలించారు.

పెదరాయవరంలో సుపరిపాలనలో

తొలి అడుగు

రంగంపేట, జూలై 25(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మండలంలోని పెదరాయవరంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది కాలంలో గ్రామంలో రూ.4.04 కోట్లతో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, కొమ్మన రాంబాబు, పూసల శ్రీను, అడబాల వెంకట్రావు, వెలమర్తి సుధాకర్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో చోరీ

మూడు ల్యాప్‌టాప్‌లు, నగదు, సెల్‌ఫోన్ అపహరణ

రాజానగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లోని రెండు వేర్వేరు షాపుల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ల్యాప్‌టాప్‌లు, నగదుతో పాటు సెల్‌ఫోన్ అపహరించారు. మండలంలో పాలచర్ల గ్రామానికి చెందిన ద్వారపూడి క్రిష్ణ మోహన్‌రెడ్డి ఆటోనగర్‌లో శ్రీసాయి తేజ ఆటోమెకానిక్ ఇంజనీరింగ్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ నెల 24వ తేదీ రాత్రి 8గంటలకు షాప్ తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం 9.30గంటలకు షాప్‌కి వచ్చి చూసేసరికి తాళాలు బద్దలుకొట్టి ఉండడం గమనించారు. దీంతో షాపు లోపలి వెళ్లి చూడగా రూ.20 వేలు నగదు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ దొంగలు అపహరణకు గురైనట్లుగా గుర్తించాడు. అలాగే ఇదే షాప్ చివరిలో ఉన్న మరో షాప్ (అరుణా ఎంటర్‌ప్రైజెస్)లో రెండు ల్యాప్‌ల్యాప్‌లు చోరీకి గురయ్యాయి. ఈ విషయమై బాధిత యజమాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్.ఐ నారాయణమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

ఘనంగా విజయ్ దివస్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విజయ్ దివస్ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. లాలాచెరువు సెంటర్లో వీరసైనికుల విగ్రహాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి అమరులైన సైనికులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మద్దిపాటి రజని, అడబాల రామకృష్ణ, పాతూరి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



జిల్లా కోర్టు గేటు వద్ద న్యాయవాదుల ప్రదర్శన

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జిల్లా కోర్టు గేటు వద్ద న్యాయవాదులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు మోహన్‌వంశీ మాట్లాడుతూ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, అన్ని కోర్టులలో మహిళా న్యాయవాదులకు వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెలా స్టైఫండ్‌గా రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగదేవర స్వర్ణ పాపా, దాసరి అమ్ములు, కాశి శ్రీనివాసరావు, ముచ్చి సాయికృష్ణ, మాగాపు పద్మ, సయ్యద్ కరీముల్లా బాషా, సుధీర్ సిన్హా, కేవీడీ కిషోర్, కిరణ్ రెడ్డి శ్రీనివాస్, బహుగుణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి వ్యాఖ్యలు విడ్డూరం: గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన కుమారుడు మిథున్ రెడ్డి విషయంలో చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని టీడీపీ నేత గన్ని కృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జైలులో మిథున్ రెడ్డికి సకల మర్యాదలు జరగుతుంటే టెర్రరిస్టులా చూస్తున్నారడనం హాస్యస్పదంగా వుందన్నారు. చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు ఒక్క నాయకుడ్ని గాని, కార్యకర్తను గాని జైలు సమీపంలోకి రానివ్వకుండా కర్ఫ్యూ పెట్టారని గుర్తుచేశారు. అదే మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలిస్తే మాత్రం జైలు వద్ద వైసీపీ నాయకులు బీభత్సం సృష్టించారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి ఒక్కొక్కటి బయటకు వస్తుందన్నారు. కొద్ది రోజుల్లో వైసీపీ అధినేత జగన్ కూడా జైలుకు వెళ్లడం ఖాయమని అందుకు సిద్ధంగా ఉండాలని గన్ని అన్నారు.

బాలికల చెస్ పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలికల పోటీలు శుక్రవారం స్థానిక అనుశ్రీ థియేటర్ సమీపంలోని ది అల్యూమ్ని హాల్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి నలుగురు విజేతలు ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీ ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.విజేతలు సీ హెచ్ అనన్య, టీవీ కావ్యశ్రీ, సత్య తేజశ్రీ సుంకర, వైనీఖిలకు కుమార్, పిండి హరిప్రసాద్, జీవీఎస్ లక్ష్మి, జి.కార్తీక్‌గోపాల్ బహుమతులు అందజేశారు.

రంపచోడవరం కేంద్రంగా జిల్లాకు

'తమ్మన్నదొర పేరు పెట్టాలి'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి దానికి తొలి మన్యం వీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమ్మన్న దొర పేరు పెట్టాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారులు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. తమ్మన్నదొర, కారుకొండ సుబ్బారెడ్డిల అనుచరుల వివరాలను ప్రభుత్వం సేకరించి ప్రచురించాలని, వారి కుటుంబాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు.



గోదారికి వరద పోటు



గోదావరికి వరద పోటు తగ్గలేదు.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రతి రోజూ సుమారు 2 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.. శుక్రవారం 2.46 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. - మెయిన్‌లో

నేటి నుంచే వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ : డీఎస్‌వో



రాజమహేంద్రరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్లు ప్రతినెలా 26వ తేదీ నుంచి 30వ తేదీలోపు 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే రేషన్ అందించాలని డీఎస్‌వో వి.పార్వతి తెలిపారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కృష్ణనాయక్‌తో కలిసి శుక్రవారం సివిల్ సప్లయిస్ అధికారులు, రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా రేషన్‌పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రతి డీలర్ తప్పనిసరిగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్‌షాపులు తెరచి ఉంచాలన్నారు. ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ డీలర్లు ప్రతిరోజూ నిర్ణీత సమయానికే షాపులు తెరవఆలన్నారు.ఏఎస్‌వో నాగమల్లేశ్వరరావు,అధికారులు,డీలర్లు పాల్గొన్నారు.

అమ్మా..శ్రావణలక్ష్మి!



శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజమండ్రి దేవిచౌక్‌లోని అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు..



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

వైసీపీ హయాంలో 16,260 మంది లివర్లు చెడిపోయాయి..

- జే బ్రాండ్ మద్యమే కారణం
- తూర్పు ప్రభుత్వాసుపత్రిలో ఇదీ ఐదేళ్ల పేషెంట్ల లెక్క
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జే బ్రాండ్ లిక్కర్ ఏరులైపారించి లివర్ వ్యాధిగ్రస్తులు పెరిగేలా చేసిందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మండిపడ్డారు. రాజమహేంద్రవరం టింబర్ మర్చంట్ అసోసియేషన్ హాలులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా 16,260 మంది లివర్లు పాడై అనేక మంది ప్రాణాల మీదకు తెచ్చుకున్నారని చెప్పారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి లెక్కల ప్రకారం 2020లో లివర్ వ్యాధిగ్రస్తులు ఇన్ పేషెంట్లుగా 8 మంది చేరగా 1303 మంది ఔట్ పెషేంట్లుగా చికిత్స చేయించుకున్నారని 2021లో 116 మంది ఇన్ పేషెంట్లు ఉంటే 3142 మంది చికిత్సచేయించుకున్నారన్నారు. 2022లో 167 మంది చేరితే 3961 మంది ఔట్ పెషేంట్లుగా చికిత్స చేయించుకున్నారని తెలిపారు. 2023లో 193 మంది చేరితే 2394 మంది చికిత్స చేయించుకున్నారన్నారు. 2024లో 345 మంది చేరితే 4631 మంది చికిత్సపొందారని చెప్పారు. ఇలా ప్రతి ఏటా లివర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య కేవలం కల్తీ మద్యం వల్లనే పెరిగిందన్నారు. జగన్ జమానలో ఫ్ లిక్కర్‌కు బానిసలై వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. 2025లో 109 మంది ఆసుపత్రిలో చేరితే 1800 మంది కిత్స చేయించుకున్నారన్నారు. లిక్కర్ స్కాంలో జైలులో ఉన్న మిథున్‌రెడ్డికి సదుపాయాల కల్పన చూస్తే అతను పిక్నిక్ వచ్చినట్టుగా ఉందన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నాయకులు మజ్జి రాంబాబు, కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు,బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకిరామయ్య, రవి యాదవ్, చాపల చిన్నరాజు, దాస్యం ప్రసాద్,చిన్ని పాల్గొన్నారు.

కూలుతుందో.. ఏమో!



ప్రమాదంలో కాకినాడ పెద్దాసుపత్రి

- స్లాబ్‌లకు లీకులు
- పాత భవనాలతో భయం
- జేఎన్‌టీయూ ఇంజనీర్ల పరిశీలన
- తొలగించాలని నివేదిక
- కొత్త నిర్మాణాలకు రూ.500 కోట్లు
- ప్రభుత్వానికి ప్రతిపాదలు
- పవన్ స్పందించాలని డిమాండ్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పేదలకు పెద్ద దిక్కయిన కాకినాడ జీజీహెచ్ దీనంగా మారింది. వేలాది మంది రోగులకు సేవలందిస్తోన్న విభాగాలు బిక్కుబిక్కుమంటున్నాయి. పాడుబడిన భవనాలు, ఎప్పుడు కూలుతాయో తెలియని బ్లాకులు రోగులు, వైద్యులను నిరంతరం భయపెడుతున్నాయి. అసలే వర్షాకాలం ఆరంభమవడంతో లీకవుతున్న శ్లాబ్‌లు, తడిచిపోతున్న రికార్డులతో జీజీహెచ్ ప్రమాదకరంగా మారింది. ఆసుపత్రికి కొత్త భవనాల నిర్మాణం అత్యవసరమైనా నిధుల్లేక ఈసురోమంటోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పేదలకు పెద్దదిక్కు కాకినాడ జీజీహెచ్. ఏ పెద్ద అనారోగ్యం వచ్చినా వారంతా వచ్చేది ఇక్కడికే. వందలాది మంది ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లతో ఈ ప్రభుత్వాసుపత్రి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇవి ఎప్పుడు కూలుతాయో అన్నట్టు మారాయి. అసలే వర్షాల నేపథ్యంలో ఎక్కడికక్కడ అనేక విభాగాల్లో గోడల దగ్గర నుంచి శ్లాబ్‌ల వరకు వర్షపునీరు లీకవుతోంది. దీంతో ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళన అందరినీ వెన్నాడుతోంది.

నిధులెప్పుడిస్తారో..

గతేడాది కాకినాడ జేఎన్టీయూ ఇంజనీర్లు ఈ భవనాలన్నింటిని పరిశీలించారు. వీటిలో అనేక భవనాలు బలహీనంగా ఉన్నట్టు గుర్తించారు. అనేక బ్లాకులు తొలగించాల్సిందేనని ఇప్పటికే నివేదిక ఇచ్చారు. పాడైన భవనాలను తొలగించి వాటి స్థానంలో జీప్లస్ 8 విధానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.500 కోట్ల వరకు ఖర్చవుతుందని తేల్చారు. ఈమేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి గతేడాది నివేదిక పంపారు. కొత్త భవనాల్లో 600 పడకలు ఉండేలా ప్రణాళికలు రూపకల్పన చేశారు. నిధుల విడుదలకు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు గుర్తుచేసినా ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్టే చెబుతున్నారు. జీజీహెచ్‌కు కొత్త భవనాలు ఎప్పుడు సమకూరుతాయో తెలియని పరిస్థితి. జిల్లా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి నిధులు విడుదలపై దృష్టిసారించాల్సి ఉంది.

బాబోయ్.. ఆ బ్లాకులు..

ఆసుపత్రిలో అనేక భవనాలు దాదాపు 50 నుంచి 60 ఏళ్లు దాటిపోయాయి. దీంతో అనేక బ్లాకులు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టున్నాయి. ప్రధానంగా అడ్మినిస్ట్రేషన్ భవనం రెండో అంతస్తులో శ్లాబ్‌ల నుంచి వర్షం నీరు లీకవడం వల్ల ఎంఆర్‌డీ సెక్షన్‌లో మెడికల్ రికార్డులన్నీ పాడవుతున్నాయి. పైగా స్లాబు పెచ్చులూడిపోవడంతో కొన్ని ప్రత్యేక వార్డులను పూర్తిగా మూసివేశారు. ఇదే భవనంలో ఈఎన్‌టీ, డెంటల్ విభాగాలు, ఓపీ జరిగే విభాగాల్లో షెడ్లు వర్షాలకు పడిపోయాయి. సర్జికల్‌వార్డు, ఆర్థోపెడిక్, అడ్మినిస్ట్రేషన్ భవనం, మెడికల్ వార్డు భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. జీప్లస్3 విధానంలో ఉన్న ఈ భవనాలన్నీ కూల్చాల్సిన పరిస్థితి ఉంది. వాస్తవానికి ఈ పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. గత వైసీపీ సర్కారు అయితే కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించేసింది. కానీ ఆసుపత్రి భవనాలు మాత్రం నిర్మించలేదు. పలుసార్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటనల్లో పాత భవనాల నిర్మాణాలకు నిధులిస్తున్నట్టు చెప్పినా కనీసం చిల్లిగవ్వ ఇవ్వలేదు.

రోజూ వేలాదిగా రోగులు..

జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగానికి రోజూ రెండు వేలమంది వరకు రోగులు వస్తారు. ఇన్ పేషెంట్ విభాగంలో 1,600 నుంచి 1,800 వరకు రోగులు ఉంటారు. నిత్యం వేలాది మంది రోగులతో ఆసుపత్రి కిటకిటలాడుతుంటుంది. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ వంటి ఎన్నో విభాగాల్లో రోగులకు కావాల్సిన సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఎక్స్‌రేలు అందుబాటులో ఉంటాయి. ఐసీయూలతోపాటు యాక్టివ్ మెడికల్ కేర్ యూనిట్లు, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్లు నిరంతరం పనిచేస్తాయి. 24 గంటలూ ఇక్కడ చికిత్స అందుతుంది. అటు జీజీహెచ్‌కు అనుబంధంగా రంగరాయ మెడికల్ కాలేజీ నుంచి వందలాది మంది వైద్యులు, నర్సులు జీజీహెచ్ విధుల్లో ఉంటారు. ఏ అనారోగ్యం వచ్చినా, ప్రమాదాలు జరిగినా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక వేలాదిమంది ఇక్కడకే శస్త్రచికిత్సకు వస్తారు. ప్రధానంగా సోమవారం రోజైతే ఓపీ విభాగాలు కిక్కిరిసిపోతాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల నుంచి రిఫర్ కేసుల సంఖ్య ప్రతి రోజూ ఉంటుంది. ఏ పెద్ద ప్రమాదం జరిగినా ఆయా కేసులను వెంటనే కాకినాడకు రిఫర్ చేసేస్తారు.



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు



రీసర్వే గ్రామసభలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

రీసర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టండి

నందమూరు గ్రామసభలో అదనపు సీఎస్ఎల్‌ఏ ప్రభాకరరెడ్డి

కొవ్వూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు సీఎస్ఎల్‌ఏ డా.కె.ప్రభాకరరెడ్డి అన్నారు. కొవ్వూరు మండలం నందమూరులో శుక్రవారం రాత్రి రీసర్వేపై అదనపు సీఎస్ఎల్‌ఏ డా.కె.ప్రభాకరరెడ్డి రైతులతో సమావేశమయ్యారు. కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో రీసర్వే పనులు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా రైతులను కలుసుకుని వారి అభిప్రాయాలను సేకరించారు. అంతకు ముందు ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. రీసర్వే ప్రక్రియలో అవలంబిస్తున్న విధానాలను పరిశీలించి, భూముల మ్యాప్ తయారీ, హక్కుల స్పష్టత, రైతుల అభ్యంతరాల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,ఆర్డీవో రాణి సుస్మిత,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ,తహశీల్దార్ దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో పీ4 కుటుంబాలు 57000

- ఇప్పటికే గుర్తించాం
- సీఎం వీసీలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పేదరికంలో ఉన్న కుటుంబాల ఆర్థికాభివృద్ధికే పీ4 మార్గదర్శి, బంగారు కుటుంబం పథకం రూపొందించినట్టు సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.ఈ మేరకు శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ప్రతి కుటుంబం విద్య, ఉపాధి, ఆరోగ్య, భవన అవసరాలతో అభివృద్ధి చెందాలనే కార్యాచరణ చేపట్టామన్నారు. ఒక వ్యక్తి ఒకే కుటుంబం కాకుండా వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మందిని దత్తత తీసుకుంటే మంచిదన్నారు. తగిన ఆధారాలు, అర్హత ప్రమాణాల ఆధారంగానే ఎంపిక ఉండాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://జీరోప్రావర్టీపీ4.ఏపీ.జీవో వీ.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా స్వయంగా కుటుంబాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు చెప్పారు. జిల్లాలోని పీ4 పథకం గురించి కలెక్టర్ పి.ప్రశాంతి సీఎం చంద్రబాబుకు వివరించారు.తాను ఇప్పటికే ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నానని చెప్పారు.జిల్లాలోని 489 గ్రామ, వార్డు సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి 1226 మంది మార్గదర్శకులను 12500 మంది బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 57 వేల బంగారు కుటుంబాలను ప్రాథమిక సర్వే చేసి గుర్తించినట్టు చెప్పారు. మార్గదర్శకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ప్రతీ అధికారి, ఉద్యోగి, సమాజంలో మెరుగైన స్థితిలో ఉన్న వ్యక్తులు ఒకరిని తప్పకుండా దత్తత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు బంగారు కుటుంబాల జీవనోపాధి కల్పన, స్థిరమైన అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక, ఆయా కుటుంబాల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి,సీపీవో అప్పలకొండ పాల్గొన్నారు.

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ!



పట్టాలెక్కని కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైన్ పనులు

- గత 65 ఏళ్లుగా ఇంతే
- నేడు..రేపు అంటూ సాగదీత
- నేటికీ లైన్‌లో పడని పనులు
- తెలంగాణలో పూర్తయిన వైనం
- ఏపీలో ఎదురుచూపులు
- ప్రాజెక్ట్ పూర్తయితే ఉపయోగం
- ఎంపీ పురందేశ్వరి దృష్టి పెట్టాల్సిందే



కొవ్వూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైను నిర్మాణంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు ఆరున్నర దశాబ్దాలుగా కాలయాపన చేస్తున్నాయి. అసలు ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తుందా అని సందేహాలను వ్యక్తమవుతున్నాయి. భద్రాచలం - కొవ్వూరు రైల్వేలైను నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రైల్వే శాఖ నుంచి గతేడాది హామీ లభించింది. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభమయ్యేది కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందని రైల్వే అధికారులు తేల్చి చెబుతున్నారు.

నిధులిస్తామన్నా.. కదలికేది..

కొవ్వూరు -భద్రాచలం రైల్వే మార్గంపై తొలి సారిగా 1960లో సర్వే చేశారు.అప్పటి నుంచి ప్రతి బడ్జెట్‌లోను ఈ రైల్వే లైను గురించి ప్రస్తావన వస్తున్నప్పటికీ ఏనాడు రూపాయి విదల్చలేదు.గడచిన పదేళ్లలో సర్వే,ఇతర పనులకు రూ.40 కోట్ల వరకు కేటాయించారు. 2011-2012 బడ్జెట్‌లో రైల్వే శాఖ కొవ్వూరు -భద్రాచలం రైల్వే లైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైను నిర్మాణానికి రూ.2,155 కోట్లు అవసరమని అంచనాలు తయారుచేశారు. ఇదిలా ఉండగా ఇటీవల సుమారు రూ.2,155 కోట్లు ప్రతిపాదిత వ్యయం మంజూరు చేస్తున్నట్టు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ప్రకటిస్తూ రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి రాతపూర్వకంగా తెలియజేశారు. అయినా ముందుకు కదల్లేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఎంపీగా పురందేశ్వరి ఉండడంతో కదలిక వస్తుందని అంతా ఆశించారు. అయినా అంతే.నిర్మాణం వ్యయం పెరుగుతుంది.

తెలంగాణలో ఓకే.. ఏపీలో షాకే..

2014లో రాష్ట్ర విభజన అనంతరం బొగ్గు రవాణా అవసరాల దృష్ట్యా భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు దాదాపు 54 కిలోమీటర్లు రైల్వేలైను నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున సింగరేణి సంస్థ యాజమాన్యం రూ. 706 కోట్లు ఖర్చు భరించగా.. దక్షిణ మధ్య రైల్వే తన వాటా రూ.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.దీంతో కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు నిర్మించిన రైల్వే లైనును 2022లో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు.ప్రస్తుతం కొవ్వూరు- సత్తుపల్లి మధ్య రైల్వే లైను నిర్మాణం పూర్తిచేస్తే సరిపోతుందని భావిస్తున్నారు.సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు (కొవ్వూరు,దేవరపల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా తెలంగాణలోని అశ్వారావుపేట, సత్తుపల్లి వరకు రైలు మార్గాన్ని నిర్మించాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైల్వే లైను పనుల్లో పురోగతి లేదు.ఈ రైలు మార్గం నిడివి మొదట్లో 165 కిలోమీటర్లు ఉండగా ప్రస్తుతం 119 కిలోమీటర్లకు తగ్గింది. ఒప్పందం ప్రకారం 100 కిలోమీటర్ల వరకు ప్రస్తుత ఏపీ ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. ఇప్పటికే తెలంగాణలో నిర్మాణం పూర్తిచేసుకుని ఏపీ నిధులకు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.కూటమి ప్రభుత్వమైనా రైల్వే లైను నిర్మాణ పనులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

భూసేకరణ చేస్తే సరి..

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, రైల్వే యూనియన్ నాయకుడు ఉన్నికృష్ణన్‌లతో కలిసి ఈ నెల 15న సికింద్రాబాద్ రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర అధికారులను కలిసి సత్తుపల్లి నుంచి కొవ్వూరు నూతన రైల్వే నిర్మాణ పనులపై ప్రస్తావించారు.దీనిపై రైల్వే జీఎం శ్రీవాస్తవ స్పందిస్తూ భద్రాచలం రోడ్- కొవ్వూరు రైల్వే లైను నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం తమ వాటా సొమ్ము చెల్లించడంతో భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకు లైను నిర్మాణం పూర్తయిందని, ఏపీ ప్రభుత్వం భూ సేకరణ చేసి అప్పగిస్తే 2030 నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. రైల్వే లైను నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అసెంబ్లీలో చర్చించారు.ఇప్పటికైనా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల ఎంపీలు ఈ రైల్వే లైను నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖపై ఒత్తిడి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే జీఎంతో చర్చిస్తున్న ఎంపీ పురందేశ్వరి(ఫైల్)

ఈ లైన్ పూర్తయితే లాభం..

కొవ్వూరు-భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) మధ్య రైల్వే లైను నిర్మాణం పూర్తయితే విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య సుమారు 110 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. రెండున్నర గంటలకు పైగా ప్రయాణ సమయం ఆదా అవుతుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై భారం తగ్గించే వెసులబాటు ఉంటుంది. కేవలం హైదారాబాద్ ప్రయాణించే రైళ్లే కాకుండా వరంగల్ మీదుగా నాగపూర్, జైపూర్, న్యూఢిల్లీ వైపు వెళ్లే రైళ్లను ఈ మార్గంలో మళ్లించవచ్చు. ఈ రైలు మార్గం పూర్తయితే డివిజన్ కేంద్రమైన కొవ్వూ రు రైల్వే స్టేషన్ ఇటు విజయవాడ, మరోవైపు భద్రాచలం వైపు వెళ్లే రైళ్లకు ప్రధాన రైల్వే జంక్షన్‌గా మారుతుంది. దీంతో ఇక్కడ మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఉంటుంది.

ఆర్చ్ బ్రిడ్జికి మరమ్మతులు 8

ప్లాస్టిక్ రహిత జిల్లా చేద్దాం
ఆగస్టు 15 టార్గెట్ : కలెక్టర్

రాజమహేంద్రవరం,జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా ఆగస్టు 15వ తేదీ నాటికి మార్చే దిశగా దీక్ష చేపట్టాలని.. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి. ప్రశాంతి పిలుపునిచ్చారు.కలెక్టరేట్ నుంచి శుక్రవారం మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని డివిజన్లు, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారుల వరకూ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సీజ్‌చేయాలని స్పష్టం చేశారు.వ్యాపారులు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేయాలన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం కలిగించేలా విద్యార్థులతో ఇంటి వద్ద చెప్పించాలన్నారు. కాటన్ బ్యాగుల వినియోగం పెంచాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు గుడ్‌బై ..కాటన్ బ్యాగ్ వినియోగం భవిష్యత్‌కు భరోసా అనే విధానంలో ప్రచారం చేయాలన్నారు.

నేడు డీఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

రాజమహేంద్రరం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యానికి వ్యతిరేకంగా శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతనాల చెల్లింపులో జాప్యంతో పాటు తలకు మించిన బోధనేతర కార్యక్రమాలు రద్దు తదితర సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్టు కమిషనర్ జీ. సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన పట్టణంలో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి సభలో చర్చించడం జరుగుతుందన్నారు. 23 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిడదవోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పెరవలి మండలం ఖండవల్లి, నిడదవోలు మండలం డి.ముప్పవరంలో ఎస్సీ కమ్యూనిటీ, బీసీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నారు. దీనికి రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు హాజరుకానున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుచేయాలి


రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసిన ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈపీడీసీఎల్‌లో ఎస్సీఎస్టీ ఉద్యోగులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుచేసి, సబ్ కేటగిరైజేషన్ జీవో నెంబర్ 19 అమలుచేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను శుక్రవారం కొవ్వూరులో వారంతా మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ సునీల్ కుమార్, శ్రీనివాస్, దేవానంద్, ప్రేమ్‌కుమార్, గణపతి, క్రాంతికిరణ్, రాజు పాల్గొన్నారు.

జాయింట్ పాసుపుస్తకాలు విభజన చేసుకోండి

తాళ్లపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వెట్ ల్యాండ్ 2.30లో జాయింట్ పట్టాదారులాగా నమోదైన భూ యజమానులు తమ పేర్లను విభజన చేసుకునేందుకు వీలుగా అవకాశం కల్పిస్తూ జేసీ చిన్న రాముడు ఆదేశాలు జారీ చేశారని తహశీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ భూ విభజన కోసం డిసెంబర్ 31వ తేదీ లోగా దీన్ని వినియోగించుకోవాలన్నారు. అలాగే గతంలో ఈ సర్వీసుకు రూ. 500 చెల్లించేవారని, ప్రస్తుతం సచివాలయంలో రూ.50 నామమాత్రపు ఫీజు చెల్లిస్తే చాలన్నారు. ఈ అవకాశం ద్వారా రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హతను పొందవచ్చన్నారు.

గోపాలపురం: రైతులు జాయింట్ ఎల్‌పీఎంల నమోదుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తహశీల్దార్ అజయ్ బాబు శుక్రవారం తెలిపారు. భూముల విభజన నమోదుకు గతంలో రూ. 550 చెల్లించేవారన్నారు. ప్రభుత్వం జీవో నెంబర్ 755ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీంతో ఎటువంటి రుసుం లేకుండా భూముల విభజనకు సంబంధించి నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 31 వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

గోపాలపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా వీస్తున్న ఈదురు గాలులకు వేలచింతలగూడెంలో రెండిళ్లు పూర్తిగా దెబ్బతినగా, మరో ఆరు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు తహశీల్దార్ అజయ్‌బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాటి వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది సేకరిస్తున్నారని తెలిపారు. వాతావరణంలో మార్పుల కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు జైలు

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో ఒక మహిళకు జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా అండ్ సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరులోని సుమ స్కూల్, రాజానగరంలోని సుమ రిఫైనరీలో డైరెక్టరుగా ఉన్న ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగకుమారి వేసిన వెంచర్‌లో నగరానికి చెందిన ముళ్లపూడి లలితాదేవి స్థలాల కొనుగోలుకు రూ.15 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చారు. అయితే ఆమె ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో లలితాదేవి నిలదీయగా, ఆమెకు రూ.19 లక్షలు చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బౌన్స్ కావడంతో లలితాదేవి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రూ.33,09,325 నగదును 9% వడ్డీతో లలితాదేవికి చెల్లించడంతోపాటు నేరస్తురాలు నాగకుమారికి ఏడాది శిక్ష విధిస్తూ ఈ నెల 22న కోర్టు తీర్పు చెప్పింది.

చాగల్లులో కోతుల బెడద

చాగల్లు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లులో కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఇళ్లపై సంచరిస్తున్నాయి. ఒక్కోసారి వీధుల్లో వెళ్లే వారిపై దాడులకు సైతం తెగబడుతున్నాయి. ముఖ్యంగా ఎస్సీ ఏరియా, ఇస్లాం పేట, ఎంపీడీవో ఆఫీసు ప్రాంతంలో వీటి సంచారం చాలా ఎక్కువగా ఉంది. వీటిని నివారించాలని కోరుతూ మండల కో ఆప్షన్ సభ్యుడు సర్దార్ పాషా గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

నడక యాతన..!

● అధ్వానంగా నందమూరు - పశివేదల రహదారి

● పట్టించుకోని అధికారులు


నందమూరు- పశివేదల రహదారి దుస్థితి

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందమూరు జంక్షన్ నుంచి పశివేదలకు వెళ్లే రహదారి మరీ అధ్వానంగా తయారైంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు న(డ)రక యాతన పడుతున్నారు. ఈ రోడ్డు గత ఎనిమిదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రహదారులు బాగుపడతాయని అంతా భావించారు. కానీ ఈ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక వర్షం వచ్చిందంటే చాలు ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయమేనని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రతిరోజూ పశివేదల నుంచి విద్యార్థులు, రైతులు, ప్రజలు వందలాది మంది వివిధ అవసరాల నిమిత్తం కొవ్వూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మొత్తం రెండు నుంచి మూడు అడుగుల లోతున గోతులు పడి ఛిద్రంగా తయారవడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పనులు ముగించుకుని రాత్రిపూట తిరిగి ఇంటికి వెళ్లాలంటే ఏ గోతులో పడతామోమోనని భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి పూట ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఒకవేళ విద్యుత్ దీపాలు వెలగకపోతే ఆ గోతుల్లో పడి పలువురు గాయాలు పాలైన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదల సంక్షేమమే 'కూటమి' లక్ష్యం : ఎమ్మెల్యే


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 3,4 వార్డుల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, బొంతా కిషోర్, కొల్లి రమేష్, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ప్రాణాలను కాపాడిన 'కొవ్వూరు' పోలీసులు


రక్షించి బయటకు తీసుకువచ్చిన పోలీసులు

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళను కొవ్వూరు పట్టణ పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళితే కొయ్యలగూడెం మండలానికి చెందిన మహిళ కుటుంబ సమస్యలతో గొడవ జరిగి శుక్రవారం కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన పై నుంచి గోదాట్లో దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి నడిచి వెళ్తోంది. కాగా, అదే సమయంలో ఆటోలో అటుగా వెళ్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి గమనించి 112 నెంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో ఎస్పీ డీ.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం, హెచ్‌సీ ఎంవీవీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇస్తూ, అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, పట్టణ పోలీసులను ఎస్పీ అభినందనలు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషిచేయాలి : ఎంపీడీవో


దేవరపల్లిలో షాపులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రాజారావు

దేవరపల్లి, జూలై25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని ఎంపీడీవో రాజారావు పేర్కొన్నారు. శుక్రవారం దేవరపల్లిలో పలు షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల అనేక సమస్యలు ఏర్పడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. దేవరపల్లిలో మూడువేల డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకవేళ ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్ , తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 13 ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం నియోజకవర్గంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 13 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ప్రధానంగా తల్లికి వందనం డబ్బులు పడలేదని, వితంతువు పింఛను మంజూరు చేయాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, కుళాయిలు వేయించాలని, రెవెన్యూకు సంబంధించి ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంతో జీవశక్తి పెరుగుదల


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ వెంకటరమణ

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఎరువుల వాడకంతో నేలలో జీవశక్తి పెరుగుతుందని జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ ఎం.వెంకటరమణ అన్నారు.కొవ్వూరు శ్రీరామా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శుక్రవారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జీవామృతం, పంచగవ్య, వర్మీ కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులను యాంత్రిక ఎరువులతో కలిపి వాడితే నేల ఫలదాయకత మరింత మెరుగవుతుందన్నారు. డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ సాగులో ఎరువులు అధిక మొత్తంలో వాడడం వల్ల మానవాళికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజనల్ సహకార అధికారి కనకదుర్గారెడ్డి, కొవ్వూరు వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, సొసైటీ డైరెక్టర్లు ఉప్పులూరి ప్రసాద్, దండుబోయిన మురళీకృష్ణ, కే.సుబ్బారావు, బీ.రాధాకృష్ణ, ఎస్‌కే ఆదిత్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'డిపో అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం'


ఆదర్శ ఉద్యోగికి సర్టిఫికెట్ అందిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి సత్యనారాయణమూర్తి

నిడదవోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా ప్రజా రవాణాధికారి వై.సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆదాయాన్ని పెంపునకు కృషి, ఇంధనాన్ని పొదుపు చేసిన ఉద్యోగులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గత నెల అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన కండక్టర్ ఎస్‌కే బాజీ, అత్యధిక ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్ ఎండీ ఇర్ఫాన్‌బాబుకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టీ.ధనుం జయరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు సత్కారం


సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట ఎంపీపీ మెయిన్ స్కూల్ నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయుడు బారణాల శంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ పాఠశాల నుంచి జీ. రామచంద్రరావు, జీ. రవికుమార్, సీహెచ్ మహేష్, జేడీ సునీత వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. వీరందరికీ వీడ్కోలు పలుకుతూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జడీవీకే ప్రసాద్, జీ. రాజారత్నం, కే.ప్రసన్నకుమార్, ఇ. సత్యనారాయణ, ఏఎంసీ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతకు యువత నడుం బిగించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర

● ఏబీఎన్ కళాశాలలో కార్గిల్ విజయ దివస్ కార్యక్రమం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్, బీజేపీ నాయకులు

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : దేశ భద్రతకు నేటి యువత నడుం బిగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షతన జరిగింది. 2025 జూలై 26 నాటికి కార్గిల్ విజయం సాధించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాల విద్యార్థులకు దేశం, యుద్ధ పరిణామాలు, సైనికుల త్యాగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జాతీయ ఐక్యత, స్థితిస్థాపకతకు ఒక పరీక్షాత్మకం (యుద్ధం దేశాన్ని ఎలా ఏకం చేసిందో విశ్లేషిస్తుంది) అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో మొదటి బహుమతి ఇంగ్లీషులో సీహెచ్.శ్రీనిధి రూ.1000, ద్వితీయ బహుమతి యు.త్రివేణి రూ. 500, తెలుగులో మొదటి బహుమతి ఏకే దుర్గాభవాని రూ. 1000, ద్వితీయ బహుమతి కే.మౌనిక రూ.500 అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అడ్వయిజర్ ఎన్వీ సుబ్బారావు, వైస్. ప్రిన్సిపాల్ డా.వై.రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడపాటి ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎం.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఈగల్ టీమ్ సీఐ పీవీ సూర్యమోహన్

దేవరపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు లోనుకావద్దని ఈగల్ టీమ్ సీఐ పీవీ సూర్యమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక బీహెచ్‌ఎస్‌ఆర్ వీఎల్‌ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యమోహన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల చట్టాలపైన విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెడువ్యసనాలకు లోనుకాకుండా విద్య, క్రీడలపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ సభ్యులు కిరణ్, డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ కుమార్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం. విక్రమ్, కళాశాల ఏవో ఆనంద్‌ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు ఎస్.వెంకటేశ్, రాము, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


యాదవోలులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దేవరపల్లి, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ డీఆర్‌సీ ఏవో వెంకన్నబాబు పేర్కొన్నారు. దేవరపల్లిలో గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవ సాయ శాఖ, ఉద్యానవనశాఖ, వ్యవసాయ శాఖ సిబ్బందికి ఇస్తున్న శిక్షణ రెండోరోజూ కొనసాగింది. అనంతరం యాదవోలులో ప్రకృతి వ్యవసాయ ద్వారా పండించే పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసా యం ద్వారా ఆకుకూరలు, కాయగూరలు, తీగ, దుంపజాతి పంటలను పండించటం వల్ల బయట మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. మండల వ్యవసాయాశాఖాధికారులు కమలరాజు, ఏసుబాబు, సోమశేఖర్, వ్యవసాయ శాఖ సిబ్బంది సతీష్, శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

220 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్ట్

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తూ భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం గామన్ వంతెన రోడ్‌లోని నయారా పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న ఇన్నోవాలో వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగా, 10 బస్తాల గంజాయిని గుర్తించారు. వాటిలోని 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన నాగరాజు, సుబ్రహ్మణ్యం, జైసల్వాను అదుపులోకి తీసుకున్నామని హనుశ్రీ పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్త్‌స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వ్యక్తిని గంజాయితో అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. ర్యాలికి చెందిన పువ్వల మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారం మేరకు ఎస్‌ఐ రాము సిబ్బందితో శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రమూర్తి, వీఆర్వో, వీఆర్‌ఏ సమక్షంలో రాము వద్ద నుంచి 470 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కొత్తపేట కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో మరో ఆరుగురిని అరెస్టు చేయాల్సి ఉందని, వారు పరారీలో ఉన్నారన్నారు.

పురుగుల మందుల దుకాణంలో తనిఖీలు

● గొల్లప్రోలులో

రూ.1.14 లక్షల విలువైన స్టాక్ సీజ్

గొల్లప్రోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని పురుగుల మందు దుకాణం హనుమాన్ ట్రేడర్స్‌లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. షాపుపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో దుకాణం నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంతో 2రోజుల క్రితం అధికారులు సీలు వేశారు. శుక్రవారం సీలు తొలగించి తనిఖీలు జరపగా స్టాకు నిల్వలు, రిజిస్టర్లకు తేడాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో రూ.1,14,625 విలువైన పురుగు మందుల స్టాకును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు పంపుతున్నట్టు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు, పిఠాపురం వ్యవసాయ అధికారులు కేవీవీ సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్చ్ బ్రిడ్జికి.. రూ.70 కోట్లతో మరమ్మతులు

● మూడేళ్లపాటు పనులు... రైళ్ల వేగ పరిమితి పెంపు




ఆర్చ్ బ్రిడ్జి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి తోరణాలు కట్టినట్టుగా కనిపించే రైల్వే ఆర్చ్ బ్రిడ్జికి మరమ్మతులు మొదలుపెట్టారు. ఆర్చ్‌లకు ఉన్న దీనా హ్యాంగర్స్‌లోని వైర్లను మారుస్తున్నారు. దాదాపు రూ.70 కోట్లతో జరుగుతున్న పనులు పూర్తి కావడానికి మూడేళ్ల సమయం పడుతుంది. గతంలో దీనా హ్యాంగర్ సమస్య రాగా సుమారు రూ.కోటితో మరమ్మతులు చేశారు. ప్రతి రోజూ ఈ వంతెన మీదుగా 50 ప్రయాణికుల రైళ్లు, 40 గూడ్స్ రైళ్లు ప్రయాణిస్తాయి. ప్రయాణికుల రైళ్లకు గంటకు 80 కిలోమీటర్లు, గూడ్స్ రైళ్లకు 60 కిలోమీటర్లు వేగ పరిమితి ఉంది. అయితే పనుల కారణంగా ఆ వేగాన్ని 30 కిలో మీటర్లకు తగ్గించారు. ఈ బ్రిడ్జిపై గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకుపోయే విధంగా డిజైన్ చేసినా ఎప్పుడూ అంత వేగంతో వెళ్లలేదు.

● ప్రత్యేకత ఇదీ

గోదావరి నదిపై 1897లో తొలి రైల్వే బ్రిడ్జి నిర్మించారు. అది వందేళ్ల సేవలందించిన తర్వాత 1997లో మూసేశారు. దీనిని మూసి వేయడానికి ముందుగానే ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణం 1991లో మొదలైంది. 1997 మార్చి 12 నుంచి ఈ వంతెనపై రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఈ ఆర్చ్ బ్రిడ్జి చూడడానికి అద్భుతమైన నిర్మాణంగా కనిపిస్తున్నా దీనిలో గొప్ప ఇంజనీరింగ్ సాంకేతికత ఉంది. వాడుకలో ఆర్చ్ బ్రిడ్జి అని పిలుస్తున్నా దీని అసలు పేరు బౌస్ట్రింగ్-గర్డర్ బ్రిడ్జి. వంతెన నుంచి ఇనుప ఊచల మాదిరిగా కనిపించే వాటిని దీనా హ్యాంగర్లు అంటారు. ఇవి మొత్తం 600 ఉంటాయి. వీటిలో ఇనుమ తదితర లోహాలతో చేసిన వైర్లు ఉంటాయి. వాటిని బ్రిడ్జి నుంచి ఆర్చ్‌లకు అనుసంధానిస్తారు. రైలు వెళ్లే సమయంలో బ్రిడ్జిపై పడే భారం ఆ వైర్లగుండా స్వేచ్ఛగా ప్రయాణించి ఆర్చ్‌లకు చేరుతుంది. అటు, ఇటు చివర్లకు చేరుకోవడం ద్వారా వెలుపలకు వెళ్లిపోతుంది. దీంతో బ్రిడ్జిపై రైలు వేగంగా వెళ్లే అవకాశం కలగడంతో పాటు బ్రిడ్జికి ఎలాంటి ఇబ్బందీ కలగదు.

● ఇప్పుడేం చేస్తున్నారు?



ఆర్చ్‌లకు వేలాడుతున్నట్లుగా కనిపిస్తున్న దీనా హ్యాంగర్స్ లోపల వైర్లు ఉంటాయి. ఈ నిర్మాణాన్ని 25ఏళ్ల కాలానికి తగినట్టుగా డిజైన్ చేశారు. ఆ కాలం ముగిసిపోయింది. దీనా హ్యాంగర్ల లోపల ఉన్న వైర్లు ఉబ్బిపోవడంతో బయటకు కనిపిస్తున్న ఇనుప కవర్ పగిలిపోతోంది. అందువల్ల ఆ వైర్లను, బేరింగులను మార్చుచేసి, సాంకేతికతను కూడా భవిష్యత్తు లో ఇబ్బంది రాని విధంగా జోడిస్తున్నారు. ఈ బ్రిడ్జి స్పాన్ (స్తంభాలను) కూడా బాగా వెడల్పుగా నిర్మించారు. ఒక్కో స్పాన్ కనీసం 98 మీటర్లు ఉంటుంది. ఒకవేళ నాలుగో వంతెన నిర్మించాలన్నా ఇబ్బంది లేకుండా స్పాన్లలో కొంత భాగాన్ని ఖాళీగా వదిలిపెట్టారు. మనకు తోరణాల మాదిరిగా కనిపిస్తున్న ఆర్చ్‌లు మొత్తం 56 ఉన్నాయి. ఈ బ్రిడ్జి పొడవు 2.745 కిలోమీటర్లు.